ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



చిత్తూరు
జిల్లా వార్తలు

శుక్రవారం 7 మార్చి 2025



డీసీసీబీలో కంప్యూటరీకరణ చివరిదశ పనుల్లో బిజీగా ఉన్న సిబ్బంది

ఇక లెక్క... పక్కా...!

సింగిల్ విండోల్లో చివరి దశకు డిజిటలైజేషన్

- ఏప్రిల్ 1 నుంచి ఆన్‌లైన్‌లోనే లావాదేవీలు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పరిధిలోని 75 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (సింగిల్ విండోల) డిజిటలైజేషన్ ప్రక్రియ చివరిదశకు చేరుకుంది. జిల్లాలవారీగా చూస్తే తిరుపతిలో 6, చిత్తూరులో 5, అన్నమయ్య జిల్లాలో 4 సింగిల్ విండోల్లో కంప్యూటరీకరణ పనులు వంద శాతం పూర్తికాగా, మిగిలిన 60 సింగిల్ విండోల్లో ఈనెల 7వ తేదీతో పూర్తిచేసేందుకు సిబ్బంది కృషి చేస్తున్నారు.కంప్యూటరీకరణ పనులు పూర్తి చేసి ఏప్రిల్ 1 నుంచి అన్ని సింగిల్ విండోల్లో లావాదేవీలను ఆన్‌లైన్‌లోనే నిర్వహించాలని ప్లాన్ చేస్తున్నారు. సింగిల్ విండోల బలోపేతానికి కేంద్ర ప్రాయోజిత పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం ఈ డిజిటలైజేషన్ కార్యక్రమాన్ని చేపట్టింది.తాజా బడ్జెట్‌లోనూ ఈ ప్రక్రియను ప్రత్యేకంగా ప్రస్తావించారు.డీసీసీబీ పరిధిలో 75 సింగిల్ విండోలున్నాయి. వీటిలో డిజిటలైజేషన్ ప్రక్రియ 8 నెలల క్రితం ప్రారంభమైంది. తొలుత నత్తనడకన ఈ ప్రక్రియ సాగడంతో జేసీ విద్యాధరి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రోజువారీ ప్రగతిని సమీక్షించడం ప్రారంభించారు.దీంతో డిజిటలైజేషన్ ప్రక్రియ చురుగ్గా సాగడంతో తుదిదశకు చేరుకుంది. తాజా సమాచారం మేరకు రాష్ట్రస్థాయిలో డిజిటలైజేషన్ ప్రక్రియలో చిత్తూరుజిల్లా నాల్గవస్థానంలో ఉంది. 2024-25 ఆర్థిక సంవత్సర వివరాలన్నీ రాష్ట్ర సహకార శాఖ ఇచ్చిన సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేస్తున్నారు. 2024 మార్చి 31 నాటికి ఆడిట్ నివేదికలో బ్యాలెన్సులు, వోచర్లు ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నారు. సాఫ్ట్‌వేర్‌లో కొన్ని సమస్యలు వస్తుండడంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరిస్తున్నారు. సింగిల్ విండోలకు అనుగుణంగా సాఫ్ట్‌వేర్‌లో కొన్ని మార్పులు చేయాల్సిరావడంతో అక్కడక్కడా జాప్యం అనివార్యమౌతోంది. ప్రీమైగ్రేషన్, పేరలల్ రన్, గో ఆన్‌లైన్ ప్రక్రియలు ముగింపు దశలో ఉన్నాయి.

- అక్రమాలకు ఇక అడ్డుకట్ట

సింగిల్ విండోల్లో డిజిటలైజేషన్ పూర్తయితే ఏరోజుకారోజు ఎంత బ్యాలెన్స్ ఉంది.... ముగింపు నిల్వ వివరాలు పక్కాగా ఆన్‌లైన్‌లో నమోదవుతాయి. గతంలో వలే ఆన్‌లైన్‌లో పాత తేదీలతో వివరాలు నమోదు చేయడం కుదరదు. దీంతో అక్రమాలకు అడ్డుకట్ట పడుతుంది. రైతులు చెల్లించిన సొమ్మును విండో సిబ్బంది అదే రోజు ఖాతాలో జమచేయకుండా కొన్నాళ్ళు వాడుకుని తర్వాత జమచేస్తుంటారు. ఇంకొందరు సిబ్బంది సొసైటీల సొమ్ము దుర్వినియోగం చేసి రైతులు చెల్లించలేదంటూ అక్రమాలకు పాల్పడుతున్నారు. డిజిటలైజేషన్ అందుబాటులోకి వస్తే రైతు చెల్లించిన రోజే అతని అప్పుఖాతాకు జమచేయాల్సి ఉంటుంది. ఇప్పటివరకు సెక్రటరి చెప్తేనే రుణగ్రహీత ఎంత చెల్లించారు, ఇంకా ఎంత బకాయి ఉందనే వివరాలు తెలుసుకునే వెసులుబాటు ఉండేది. ఇక ఆ పరిస్థితి ఉండదు. సొసైటీ ఎంతమందికి అప్పులిచ్చింది, రుణగ్రహీతల వివరాలు, వారు ఎంత చెల్లించారు ... వంటి వివరాలన్నీ ఆయా స్థాయిల్లోనే తెలుసుకోవచ్చు.సింగిల్ విండోల అకౌంటింగ్‌లోనూ పారదర్శకత పెరుగుతుంది. ఏ సమయంలోనైనా విచారణ అధికారి ఏ సమాచారమైనా తెలుసుకోవచ్చు. ఈకేవైసీ చేశాకే రైతులకు రుణాల మంజూరు చేయడం వల్ల నకిలీ రుణగ్రహీతల బెడద తప్పనుంది.



భానుడి ప్రతాపం మొదలైందబ్బా..!



చిత్తూరు కలెక్టరేట్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వేసవికి ముందే భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు.వారం రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలుగా నమోదవుతుండగా రెండ్రోజులుగా ఒక్కసారిగా 37-39 డిగ్రీలకు చేరుకున్నాయి.గురువారం ఉదయం 10గంటలకే ఎండవేడిమి అధికమవడంతో గాంధీ విగ్రహం, దర్గాసర్కిల్ వంటి ప్రధాన రహదారులు ప్రజల రాకపోకలు లేక బోసిపోయాయి.చిరువ్యాపారులు నెత్తిన గొడుగులను ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు సాగిస్తున్నారు. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే, రానున్న నాలుగు నెలలు ఎలారా స్వామీ అంటూ జనం ఆందోళన పడుతున్నారు. గురువారం అత్యధికంగా శ్రీరంగరాజపురంలో 39.7డిగ్రీలు, తవణంపల్లెలో 39.7, గుడుపల్లె, గుడిపాల, చిత్తూరు రూరల్ మండలాల్లో 39 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మండలాలవారీగా ఐరాలలో 37.9, నింద్రలో 37.9, గంగవరంలో 37.5, నగరిలో 37.5, పులిచెర్లలో 37.4, పూతలపట్టులో 36.9, గంగాధరనెల్లూరులో 36.8, బంగారుపాళ్యంలో 36.7, చౌడేపల్లిలో 36.4, రొంపిచెర్లలో 36.4, పాలసముద్రంలో 36.4, విజయపురంలో 36.4, యాదమరిలో 36.3, పెద్దపంజాణిలో 35.9,పెనుమూరులో 35.7, వి.కోటలో 35.6, సదుంలో 35.5, వెదురుకుప్పంలో 35.5, కుప్పంలో 35.3, సోమలలో 34.8, శాంతిపురంలో 34.6, కార్వేటినగరంలో 34.5, బైరెడ్డిపల్లిలో 34.4, పలమనేరులో 33.3, పుంగనూరులో 32.9, రామకుప్పంలో 32.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

75మంది ఎండీయూ ఆపరేటర్లకు జీతాలు కట్

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ నిత్యావసర వస్తువులు అందించాల్సిన ఎండీయూ వాహన ఆపరేటర్లు విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించారన్న ఆరోపణపై 75మందికి ఫిబ్రవరి నెల జీతాలు నిలుపుదల చేస్తూ జిల్లా పౌరసరఫరాల శాఖ ఉత్తర్వులు జారీచేసింది. రేషన్‌కార్డుదారులకు చిత్తూరు డివిజన్‌లో 167 మంది, పలమనేరు డివిజన్‌లో 169 మంది ఆపరేటర్లు ప్రతినెలా 1-17 తేదీల మధ్య నిత్యావసర వస్తువులు అందజేస్తున్నారు. వీరికి ఒక్కొక్కరికీ రూ.18వేల జీతం, వారి సహాయకులకు రూ.3వేల జీతం ప్రభుత్వం చెల్లిస్తోంది. కాగా ఫిబ్రవరిలో కార్డుదారులకు నిత్యావసర వస్తువులు సక్రమంగా అందించని కారణంగా 75మంది ఆపరేటర్ల జీతాలను నిలిపివేస్తూ జారీ చేసినట్లు డీఎస్వో శంకరన్ తెలిపారు.



ఆయుర్వేదానికి ప్రోత్సాహమివ్వండి

టీటీడీ ఆస్పత్రులను మినహాయిస్తే రాష్ట్రవ్యాప్తంగా ఆయుర్వేద ఆస్పత్రుల్లో వైద్యుల కొరత కనబడుతోంది. హోమియోపతి,నేచురోపతికి సంబంధించి 26 డిస్పెన్సరీల నిర్వహణ అస్తవ్యస్తంగా సాగుతోంది. కరోనా మహమ్మారి అనంతరం రాష్ట్రంలో ప్రజలు ఆయుర్వేదం వైపు ఆకర్షితులైనప్పటికీ ఆస్పత్రుల్లో ఆయుర్వేద మందులు,సిబ్బంది కొరత ఎక్కువగా ఉంది.ఆయుర్వేద మొక్కలకు ప్రోత్సాహం, ఆయుర్వేద ఉత్పత్తులను ప్రమోట్ చేయడం ద్వారా భవిష్యత్తులో ఆయుర్వేద వైద్యానికి బలం చేకూరుతుంది కాబట్టి ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలి. బంగారుపాళ్యం మండలంలో పురాతనమైన మొగిలి ఆలయం, దానికి అనుబంధంగా ఉన్న దేవరకొండను సాంస్కృతిక, పర్యాటక శాఖలో కలపాలి. దీంతో ఆ ప్రాంతం పర్యాటకపరంగా అభివృద్ధి చెందుతుంది.సముద్రమట్టానికి 320 మీటర్ల ఎత్తులో ఉండడం, చుట్టుపక్కల కొండతో కూడిన వ్యాలీ ఉండడం ఇక్కడ ప్యారాచూట్ ఏర్పాటుకు అనుకూలంగా ఉంటుంది.



\- మురళీమోహన్, పూతలపట్టు ఎమ్మెల్యే

మరింత పారదర్శకంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ

నాన్ జ్యుడీషియల్ స్టాంపుల అమ్మకాలకు కొత్త నిబంధనలు

జిల్లా రిజిస్ట్రార్ వెంకటరమణమూర్తి



చిత్తూరు కలెక్టరేట్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) :స్టాంపులు, రిజిస్ట్రేషన్ల వ్యవస్థను రాష్ట్రప్రభుత్వం ప్రక్షాళన చేస్తోందని జిల్లా రిజిస్ట్రార్ వెంకటరమణ మూర్తి చెప్పారు. గురువారం ఆయన ఆంధ్రజ్యోతి ప్రతినిధితో పలు విషయాలను పంచుకున్నారు.అవి ఆయన మాటల్లోనే..... రిజిస్ట్రేషన్ శాఖలో సేవలను సరళతరం చేస్తున్నాం. గత ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన ఈ-స్టాంపింగ్ విధానంపై ప్రజలనుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చిన నేపథ్యంలో పాత విధానంలో స్టాంపు పత్రాల ద్వారా రిజిస్ట్రేషన్ చేసేందుకు రంగం సిద్ధమైంది.అయితే నాన్ జ్యుడీషియల్ స్టాంపు అమ్మకాలకు కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చాయి. స్టాంపు కాగితాలను కొనాలంటే ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని ప్రభుత్వ ఖాతాకు నగదు జమచేయాలి. కంప్యూటర్‌లో నమోదు చేసుకున్న తర్వాత సెల్‌ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. ఆ ఓటీపీని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ కౌంటర్‌లో చూపితే స్టాంపులు ఇస్తారు. ఒక స్టాంపు కొన్నా ఆధార్ నెంబరును తప్పక నమోదు చేయాలి. ప్రతి వెండరు కూడా కంప్యూటర్, ప్రింటర్ కొనుగోలు చేయాల్సిందే. ఏ వెండరు దగ్గర ఎన్ని స్టాంపులున్నాయో రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో తెలుసుకుంటారు.నిబంధనల ప్రకారం విక్రయించని వెండర్లపై చర్యలు తీసుకుంటారు. ఇటీవల రూ.40లక్షల విలువగల రూ.100 నాన్ జ్యుడీషియల్ స్టాంపులు జిల్లా కార్యాలయానికి చేరాయి. ఎస్ఆర్‌ల వారీగా వాటిని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు త్వరలో పంపిస్తాం. రాబోయే రోజుల్లో రూ.10, రూ.20 స్టాంపు పత్రాలు కూడా అందుబాటులోకి వచ్చే అవకాశముంది.

- వి. కోటలో ఎస్ఆర్ ఏర్పాటుకు ప్రతిపాదన

కుప్పం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో పెరుగుతున్న రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు తగ్గట్లుగా వి.కోటలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదన స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ డీఐజీ ద్వారా ప్రభుత్వ పరిశీలనకు వెళ్ళింది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు పెయింటర్ల దుర్మరణం



జయకుమార్, రవి మృతదేహాలు

చిత్తూరు అర్బన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందారు. ఒకరు స్వల్పంగా గాయపడ్డారు. స్థానికులు, ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు నగర పరిధిలోని దొరకుంటకు చెందిన జయకుమార్, శంకరయ్యగుంటకు చెందిన రవిలు పెయింటర్లుగా పనిచేస్తున్నారు. వీరిద్దరూ గురువారం ఉదయం ద్విచక్ర వాహనంలో పనుల కోసం యాదమరి మండలం జంగాలపల్లెకు వెళ్లారు. పనులు పూర్తయ్యాక తిరిగి ఇంటికి బయల్దేరారు. చెన్నై- బెంగళూరు బైపాస్ రోడ్డుపైకి వచ్చేసరికి బెంగళూరు వైపు వెళుతున్న కారు వేగంగా వచ్చి వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. అనంతరం అటు వైపుగా ద్విచక్ర వాహనంపై వెళుతున్న జానకారపల్లెకు చెందిన తులసీరామ్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో రవి అక్కడికక్కడే మృతి చెందగా.. జయకుమార్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లేలోపు మరణించాడు. తులసీరామ్‌కు స్వల్పగాయమైంది. ట్రాఫిక్ సీఐ నిత్యబాబు కేసు నమోదు చేశారు. మృతదేహాలకు చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించాక కుటుంబీకులకు అప్పగించారు.

తిరుపతి ఎయిర్‌పోర్టులో శ్రీవాణి టికెట్ల కోటా పెంచండి

తిరుపతి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతి విమానాశ్రయంలో విక్రయించే శ్రీవాణి టికెట్ల కోటా పెంచాలని విమానాశ్రయం అధికారులు టీటీడీని కోరారు. ప్రస్తుతం ఇక్కడ రోజుకు 200 టికెట్లు మాత్రమే జారీ చేస్తున్నారు. మధ్యాహ్నం తర్వాత విమానాల్లో వచ్చేవారికి టికెట్లు లభించడం లేదు. ఈ సంఖ్యను వెయ్యికి పెంచాల్సిందిగా విమానాశ్రయ అధికారులు కోరినట్లు తెలిసింది. అలాగే రూ. 300ల దర్శన టికెట్ల కౌంటర్‌ను కూడా ఎయిర్‌పోర్టులో ఏర్పాటు చేయాలని, రోజుకు 1000-1500 టికెట్లు కేటాయించాలని కోరారు. ఇందువల్ల దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే విమాన ప్రయాణీకుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉంది. దీనిపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని అధికారులు, పాలకవర్గం ముఖ్యులు చెప్పినట్లు సమాచారం.

20 అడుగుల ఏకశిలా విగ్రహం

అలాగే తిరుపతి విమానాశ్రయం లాంజిలో 20 అడుగుల శ్రీవారి ఏక శిలా విగ్రహం ఏర్పాటు చేయాలని కూడా ఎయిర్‌పోర్టు అధికారులు నిర్ణయించారు. ఎయిర్‌పోర్టు వెలుపల కూడా రెండు చిన్న విగ్రహాలు ఏర్పాటు చేయాలనుకుంటున్నారు. శ్రీవారి శిలా విగ్రహాలను భక్తుల సహకారంతో అందించాలంటూ ఎయిర్‌పోర్టు అధికారులు టీటీడీని అభ్యర్థించారు. దీనికి టీటీడీ ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.

తిరుపతి జిల్లాకు 39 మంది ప్రొబేషనరీ ఎస్ఐలు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 6(ఆంధ్రజ్యోతి): జిల్లాకు కొత్తగా 39 మంది ప్రొబేషనరీ ఎస్ఐలను కేటాయిస్తూ డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా ఆదేశాలు జారీ చేశారు. వీరు గురువారం ఎస్పీ కార్యాలయానికి చేరుకుని ఎస్పీ హర్షవర్ధనరాజు ఎదుట రిపోర్టు చేశారు. పోలీసు అతిథి గృహంలో వారితో సమావేశమైన ఎస్పీ ప్రతి ఒక్కరూ చట్ట పరిధిలో ఉద్యోగం చేస్తూ బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. బేసిక్ పోలీసింగ్, టెక్నాలజీని అందిపుచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్పీ హేమంత్, ఏఎ సురేష్‌బాబు, సీఐ సాదిక్ ఆలీ పాల్గొన్నారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శుక్రవారం) : 6.28

సహరి (శనివారం) : 5.05



పీఈఎస్ దొరస్వామి కన్నుమూత

చిత్తూరు/యాదమరి/బెంగళూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : పీఈఎస్ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు ప్రొఫెసర్ ఎంఆర్ దొరస్వామి(88)కన్నుమూశారు.వయోభారం సమస్యలతో కొన్నాళ్లుగా ఇబ్బంది పడుతున్న ఆయన బెంగళూరు బనశంకరి రెండోస్టేజ్‌లోని తన నివాసంలో గురువారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య రాధామనోహరి, కుమారుడు జవహర్ దొరస్వామి, కూతురు డాక్టర్ రూప సురేశ్ ఉన్నారు. చిత్తూరు జిల్లాలోని యాదమరి మండలం కోణాపల్లి పంచాయతీ నర్రావూరు గ్రామంలో ఎం. రామానాయుడు, ఎం. మీనాక్షమ్మ దంపతులకు 1937వ సంవత్సరం నవంబరు7న జన్మించిన ఆయన సమీపంలోని కన్నికాపురం ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి వరకూ చదువుకున్నారు. 6 నుంచి ఎస్ఎస్ఎల్‌సీ వరకు చిత్తూరు కణ్ణన్ కాలేజీ,బెంగళూరులోని సెయింట్ జోసఫ్ కళాశాలలో డిగ్రీ చదివారు.బెంగళూరు సెంట్రల్ కాలేజీలో ఎంఏ ఎకనామిక్స్ చేసిన ఆయన 1968లో బీఎంఎస్ కాలేజీలో బీఎల్ చదివారు.బెంగళూరులోనే పీఈఎస్ విద్యాసంస్థను స్థాపించి, కొంతకాలం ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. ఆ తర్వాత హనుమంతనగర్‌లో పీయూ కళాశాలను ప్రారంభించారు.ఆ విద్యాసంస్థలు ప్రస్తుతం పీఈఎస్ యూనివర్సిటీగా ఎదిగాయి.ప్రస్తుతం బనశంకరిలో ఇంజనీరింగ్ కళాశాల, ఎలక్ట్రానిక్ సిటీలో ఇంజనీరింగ్ కళాశాల, మెడికల్ కళాశాల క్యాంపస్‌లు ఉన్నాయి. సర్జాపుర, కత్రిగుప్పెల్లో పబ్లిక్ స్కూల్స్, కుప్పంలో పీఈఎస్ వైద్య కళాశాల, యాదమరిలో పీఈఎస్ పబ్లిక్ స్కూల్ నిర్వహిస్తున్నారు.దొరస్వామి సోదరుడు కుమారస్వామి నాయుడు యాదమరి స్కూలుకు డైరెక్టర్‌గా వున్నారు. కర్ణాటక విధానపరిషత్ సభ్యుడిగా వ్యవహరించిన కాలంలో పూర్తిస్థాయి గ్రాంట్లను దొరస్వామి నాయుడు పాఠశాలల ప్రగతికే కేటాయించారు. 2019లో యడియూరప్ప ప్రభుత్వంలో విద్యాసంస్కరణల సలహాదారుగా పని చేశారు. బెంగళూరు నగర పరిధిలోని ప్రభుత్వ పాఠశాలను 20 ఏళ్లక్రిందటే దత్తత తీసుకుని మౌలిక సదుపాయాలతోపాటు బోధనలకు అదనంగా ఉపాధ్యాయులను నియమించారు.మైసూరు యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. తన విద్యాసంస్థల్లో గుణాత్మకతతోపాటు క్రీడలు, యోగా, నైతికతకు దొరస్వామి నాయుడు ప్రాధాన్యత ఇచ్చారు.

దొరస్వామి మృతి కలచివేసింది:సీఎం చంద్రబాబు

పీఈఎస్ విద్యాసంస్థల వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎంఆర్ దొరస్వామి నాయుడు మృతి చెందారన్న వార్త తనను తీవ్రంగా కలచివేసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీ, కర్ణాటక రాష్ట్రాల్లో మెడిసిన్, ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, లైఫ్ సైన్సెస్ రంగాలకు సంబంధించి 12విద్యాసంస్థలను నడుపుతూ విద్యాదాతగా నిలిచారన్నారు. కుప్పం ప్రాంతంలో పీఈఎస్ విద్యాసంస్థల ద్వారా విశేష సేవలందించిన దొరస్వామి మృతి తీరని లోటు అన్నారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ... దొరస్వామి ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుడ్ని ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు.అలాగే దొరస్వామి నాయుడి మృతి పట్ల రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యేలు అమరనాథ రెడ్డి,గురజాల జగన్మోహన్, పులివర్తి నాని,వీఎం థామస్,భానుప్రకాష్,మురళీమోహన్,యాదమరి మండల టీడీపీ అధ్యక్షుడు మురార్జీ యాదవ్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ తదితరులు సంతాపం తెలిపారు.అలాగే దొరస్వామి మృతిపట్ల కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్,మాజీ సీఎం యడియూరప్ప తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బనశంకరిలోని ఆయన నివాసానికి వెళ్లి నివాళు లర్పించారు.

ఆక్రమణల క్రమబద్ధీకరణకు అవకాశం

నగరి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఆక్రమణలను క్రమబద్ధీకరిస్తున్నట్లు ఆర్డీవో భవాని శంకరి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2019 అక్టోబరు 15వ తేదీకి ముందు ఆక్రమించుకున్న స్థలాల్లో చేపట్టిన నిర్మాణాలను నిబంధనల మేరకు క్రమబద్ధీకరణ చేయడం జరుగుతుంది. ఆక్రమిత స్థలంలో ఆర్‌సీసీ రూఫ్‌కానీ, ఇటుకగోడలతో కూడిన ఆస్‌బెస్టాస్ రూఫ్ కానీ ఉండాలి. ఆక్రమిత ప్రాంతంలో ఇల్లున్న వ్యక్తికి మరోచోట ఉండకూడదు. ఏ గృహ నిర్మాణ పథకంలోనూ ఆక్రమితదారు, వారి కుటుంబీకులు లబ్ధిదారుగా ఉండకూడదు. కుటుంబంలోని మహిళా సభ్యులు మాత్రమే క్రమబద్ధీకరణకు అర్హులు. ఆక్రమిత స్థలంలో నివాసం ఉన్న కుటుంబానికి నెలసరి విద్యుత్ వినియోగం 300 యూనిట్లకన్నా తక్కువ ఉండాలని ఆర్డీవో పేర్కొన్నారు.

ఇంటర్ ఫస్టియర్ పరీక్షల్లో 1,007 మంది గైర్హాజరు

చిత్తూరు సెంట్రల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా గురువారం జరిగిన ఇంటర్ ఫస్టియర్ మ్యాథ్స్, సివిక్స్, బోటనీ పరీక్షల్లో 17474 మందికి విద్యార్థులగాను 16,467 మంది హాజరయ్యారు. 1007 మంది గైర్హాజరైనట్లు డీవీఈవో సయ్యద్‌మౌల తెలిపారు. జనరల్‌లో 15,295 మందికి 14,500 మంది హాజరవగా, 795 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌లో 2,179 మందికి 1,967 మంది హాజరవగా, 212 మంది గైర్హాజరైనట్లు డీవీఈవో పేర్కొన్నారు.



ఆత్మరక్షణ శిక్షణ అవశ్యం : డీఈవో

● రాణీలక్ష్మీబాయి సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ ప్రారంభం

తిరుపతి(విద్య), మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బాలికలకు ఆత్మరక్షణ విద్యలో శిక్షణ అత్యంత అవశ్యమని జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ అన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో నిర్వహించనున్న రాణీ లక్ష్మీబాయి ఆత్మరక్షణ శిక్షణా కార్యక్రమాన్ని ఆయన గురువారం డాక్టర్ ఎస్ఆర్కే మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో ఆయన ప్రారంభించారు. బాలికలపై పెరుగుతున్న నేరాలను దృష్టిలో ఉంచుకుని వారికి భద్రత కల్పించడానికిగాను ప్రభుత్వం పాఠశాలల్లో బాలికలకు పోరాట విద్యల్లో శిక్షణనందిస్తోందని వివరించారు. జిల్లా ఉప విద్యాశాఖ అధికారి బాలాజీ మాట్లాడుతూ ఆత్మరక్షణ శిక్షణ ద్వారా బాలికలు మానసికంగా, మేధోపరంగా, శారీరకంగా దృఢంగా రూపొందుతారని, ఆపద సమయంలో తమను తాము రక్షించుకోగలుగుతారని చెప్పారు. రూపేష్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రూపేష్‌బాబు, సీఎంఓ సురేష్, పాఠశాల హెచ్ఎం ఎంఏ కృష్ణకుమార్, రూపేష్ సొసైటీ శిక్షకులు పాల్గొన్నారు.

→ మాట్లాడుతున్న డీఈఓ కేవీఎన్ కుమార్, పాల్గొన్న డీవై ఈఓ బాలాజీ, సీఎంఓ సురేష్ తదితరులు

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 27 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

మంగళవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.11 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 63,285

తలనీలాలు సమర్పించినవారు: 20,829

చంద్రకళ

● దేశ,విదేశాల్లో మెప్పు పొందుతున్న తొర్రూరు కొయ్యబొమ్మలు

జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నాను. గ్రామీణ కళ నాకు కూడుపెట్టింది. నా ఇద్దరు పిల్లల భవిష్యత్తుకి బాట వేసింది. ఈ సమయంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సహకారం మరువలేనిది. ఆడవాళ్లతో పాటూ మగవాళ్లకూ ఉపాధి చూపే స్థాయికి నేను చేరుకున్నాను.
- చంద్రకళ



రేపు అంతర్జాతీయ మహిళా దినోత్సవం



సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఢిల్లీకి వెళ్లినపుడు ప్రధాని మోదీ కీ, కేంద్ర మంత్రులకూ ఏపీ హస్తకళాకృతులను కానుకలుగా అందజేస్తుంటారు. అందులో కొయ్యతో చేసిన దేవతామూర్తులు, గోపురాల బొమ్మలు ముఖ్యమైనవి. ఈ అద్భుత కొయ్య కళాఖండాలు తయారవుతున్నది మన పుత్తూరు మండలంలోని తొర్రూరులో అని చాలా మందికి తెలియదు. ఒక మహిళ ఈ దారుశిల్పాల రూపశిల్పి. ఆమె పేరు చంద్రకళ. భర్త మరణం తర్వాత తను బతకడానికి నేర్చుకున్న కళ ఇప్పుడు 35 మందికి బతుకు చూపిస్తోంది. అంతర్జాతీయ ఖ్యాతికి కారణమైంది.

- పుత్తూరు అర్బన్, ఆంధ్రజ్యోతి

కుప్పంలో పుట్టిన చంద్రకళ బీకాం కంప్యూటర్స్ చేశారు. అంతకన్నా పై చదువులకు వెళ్లాలనే ఆశ ఉన్నా పేద కుటుంబానికి సాధ్యం కాలేదు. పెళ్లి చేసేశారు. 1998లో పుత్తూరుకి అత్తగారింటికి చేరిన ఆమె తన భర్త సంప్రదాయ పద్ధతుల్లో చెక్కే చేసే కొయ్యబొమ్మలను దీక్షగా చూసేవారు. ఎంత కష్టపడ్డా ఆదాయం వచ్చేది కాదు. ఇద్దరు కొడుకులు పుట్టారు. కొయ్య బొమ్మలు చెక్కడం తనూ నేర్చుకున్నారు. ఆర్థిక సమస్యల్లోంచి బయటపడడానికి ఒక పొదుపు సంఘంలో ఆమె చేరారు. భర్తను ఒప్పించి 5 వేలు అప్పు తీసుకుని వేప, వెంగ, చీమచింత కొయ్యలు కొని తన ఆలోచనలకు అనుగుణంగా బొమ్మలు చెక్కడం మొదలు పెట్టారు. ఈ కొత్తదనం కొనుగోలుదారులను ఆకర్షించింది. 2017లో భర్త హఠాన్మరణం ఆ కుటుంబాన్ని కుంగదీసింది. అయితే చేతిలో ఉన్న కళ ఆమెకు దారి చూపింది. బొమ్మల్లో, రంగుల్లో నిరంతరం కొత్తదనం కోసం చేసిన ప్రయత్నం ఫలించింది. చంద్రకళ చెక్కిన బొమ్మలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. తనలాంటి మరికొందరు మహిళలను ఆమె పోగేసుకుని కొయ్యబొమ్మల పనిలో భాగం చేసింది. ఎంపీఎస్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ పేరుతో ఆమె సంస్థ ఇప్పుడు 35 మందికి ఉపాధి చూపుతోంది. ఆన్‌లైన్‌లోనూ అమ్మకాలు చేస్తోంది. నెలకు లక్షకు పైగా ఆదాయం లభిస్తోంది. మార్చి 8న మహిళా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న మార్కాపురంలో ని డ్వాక్రా బజారులోనూ తొర్రూరు కొయ్యబొమ్మల ప్రదర్శన ఉంటుంది.

ఇదే ప్రత్యేకత:

సింథటిక్, ఎనామిల్‌తో పాటు మల్టీషేడ్ రంగులను వినియోగించడం వల్ల చంద్రకళ బొమ్మల్లో సహజత్వం ఉట్టిపడుతోంది. బొమ్మల తయారీకి మీమ్ వుడ్ , టీక్ వుడ్, కంట్రీవుడ్ లను ఈమె వినియోగిస్తున్నారు. వీటికి వాటర్‌ప్రూఫ్ కోటింగ్ ఉంటుంది..

ఇల్లాలి చదువు ఇంటికే కాదు జగానికే వెలుగు అని తిరుపతి నగరంలోని మూడు విద్యా సంస్థలు నిరూపిస్తున్నాయి. దివంగత ముఖ్యమంత్రి ఎన్టీరామారావు ఆనాడే మహిళావిద్య అవసరాన్ని గుర్తించి, వారికోసమే ప్రత్యేకించి ఓ విశ్వవిద్యాలయం తిరుపతిలో ఏర్పాటు చేశారు. అంతకు ఎన్నేళ్ల ముందో టీటీడీ సహకారంతో ఈ నగరంలోనే తొలి మహిళా డిగ్రీ కళాశాల ఏర్పడింది. ఇటీవల ఏర్పడిన మహిళా వైద్యవిద్యాలయం మూడో కిరీటంగా మారింది. మహిళా సాధికారతకు ప్రత్యక్ష సాక్ష్యాలుగా ఈ విద్యాసంస్థలు నిలుస్తున్నాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి..తిరుపతి(విద్య)

తిరుపతి సిగలో

మూడు పద్మాలు

తొలి వర్సిటీకి బీజం



పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం

1983 ఏప్రిల్ 14న తిరుపతిలో పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఏర్పడింది. 138 ఎకరాల విస్తీర్ణంలో 9 విభాగాలతో శ్రీకారం చుట్టుకుంది. నాలుగు దశాబ్దాల్లో 50 కోర్సులకు విస్తరించింది. ఆరు వేల మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు. . బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో ప్రత్యేకతను చాటుకుంటూ జాతీయ, అంతర్జాతీయ స్థాయి గుర్తింపును పొందగలిగింది. యూజీసీ నాక్ ఏ-ప్లస్ గ్రేడ్‌ను కూడా సాధించింది. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో ఉత్తమ ర్యాంకు సొంతం చేసుకుంది. విదేశీ విద్యార్థులకు సైతం సంగీత విద్యను నేర్పుతోంది. మహిళల్లో సామాజిక చైతన్యానికి జరుగుతున్న కృషిలో పాలుపంచుకుంటోందీ వర్సిటీ. పీఎం ఉష పథకం కింద అందిన రూ.100 కోట్ల నిధి వర్సిటీ పురోగతికి దోహదపడింది

తొలి 'పట్టా'భిషేకం



పద్మావతి డిగ్రీ కళాశాల

రాష్ట్రంలో తొలి మహిళా కళాశాలకు తిరుపతి కేంద్రమైంది. 1951లో ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో అబ్బాయిల కాలేజీలో అమ్మాయిలను చేర్చుకోరాదంటూ మద్రాసు వర్సిటీ సిండికేట్ తీర్మానించింది. దీంతో మహిళా విద్యకు గండి పడింది. వెంటనే టీటీడీ స్పందించింది. మహిళలకు బాసటగా నిలిచింది. 1952లో వంద ఎకరాల్లో వేంకటేశ్వర స్త్రీల కళాశాలను ఏర్పాటు చేసింది. రెండేళ్లకు ఎస్వీ యూనివర్సిటీ ప్రారంభమైంది. 1956లో పద్మావతీ మహిళా డిగ్రీ కాలేజీగా పేరు మారింది ప్రిన్సిపాల్ రాజేశ్వరిమూర్తి నేతృత్వంలో ఈ కాలేజి అభివృద్ధికి విశేష కృషి జరిగింది. మాజీ రాష్ట్రపతులు నీలం సంజీవరెడ్డి, బాబూ రాజేంద్రప్రసాద్, మాజీ ప్రధానులు జవహర్‌లాల్ నెహ్రూ, లాల్‌బహదూర్ శాస్త్రి వంటి ప్రముఖులు ఈ కాలేజీని సందర్శించి ముగ్ధులయ్యారు.

●మహిళల ..మెడి'కల' నెరవేరింది

దేశ రాజధాని ఢిల్లీ తర్వాత దక్షిణాదిన తొలి ప్రభుత్వ మహిళా వైద్యకళాశాల తిరుపతిలోనే ఆవిర్భవించింది. 2014లో 50 ఎకరాల్లో స్విమ్స్‌కు అనుబంధంగా పద్మావతి మహిళా వైద్య కళాశాల 150 సీట్లతో ప్రారంభమైంది. తర్వాత బలహీన వర్గాలకోసం 25 సీట్లను కేటాయించింది. యూజీ-నీట్ ద్వారా అడ్మిషన్లు జరుగుతున్నాయి. 175 సీట్లతో ఆరు బ్యాచ్‌ల వైద్య విద్యార్థులను ఇప్పటివరకూ అందించింది. దాదాపు వెయ్యి మంది మహిళా వైద్యులు తయారై సేవలందిస్తున్నారు. ఈకాలేజ్ టీచింగ్ రీసెర్చ్‌గా ఉపయోగపడుతోంది. ఇక్కడి వైద్యులకు ప్రైవేట్ ప్రాక్టీస్ అవకాశం లేకపోవడంలో నాణ్యమైన బోధన జరుగుతోంది. స్విమ్స్‌లో సూపర్ స్పెషాలిటీ కోర్సుల వల్ల అరుదైన ఆపరేషన్లపై శిక్షణకూ అవకాశం కలుగుతోంది.



పద్మావతి మహిళా వైద్య కళాశాల

స్కూల్ అసిస్టెంట్ నుంచీ పీవీకేఎన్ ప్రిన్సిపాల్ దాకా

61 ఏళ్ల కళాశాల చరిత్రలో తొలి మహిళా ప్రిన్సిపాల్ ● ప్రథమ ప్రయత్నంలోనే నాక్ అటానమస్ ఎ గ్రేడ్ సాధనతో ప్రశంసలు

చిత్తూరు సెంట్రల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): చదువుకునే రోజుల్లో ఆమె మంచి హాకీ క్రీడాకారిణి.ఆటపై మక్కువతో సెంటర్ ఫార్వర్డ్ ప్లేయర్‌గా చెన్నై, పూనే, భువనేశ్వర్, ఢిల్లీల్లో జరిగిన హాకీ పోటీల్లో రాణించారు. చదువులోనూ ముందుండి ఎమ్మెస్సీ, బీఈడీ, ఎంఫిల్, పీహెచ్‌డీ పట్టాలు పొందారు. 1996 డీఎస్సీలో తొలి సారే ఎంపికై కెమిస్ట్రీ సబ్జెక్టులో ప్రతిభ చూపి స్కూల్ అసిస్టెంట్‌గా ఉపాధ్యాయ జీవితం మొదలుపెట్టారు.ఇటీవల జిల్లాలోనే పేరొందిన చిత్తూరు పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తొలి మహిళా ప్రిన్సిపాల్‌గా వచ్చారు. రాగానే కళాశాలకు నాక్ ఎ గ్రేడ్ గుర్తింపు తీసుకురావడానికి కృషి చేసి సాధించి ప్రశంసలందుకుంటున్న పి.జీవన జ్యోతి జీవన ప్రస్థానమిది.

తిరుపతి వాస్తవ్యులు, ఎక్స్ సర్వీస్‌మెన్ పి.విశ్వనాథం, విద్యావతి దంపతుల కుమార్తె పి.జీవనజ్యోతి ఇంటర్ వరకు తిరుపతి కేంద్రీయ విద్యాలయలో చదువుకున్నారు. ఆపై శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో బీఎస్సీ చదివారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ చేశారు.హాకీ క్రీడపై మక్కువ పెంచుకుని జాతీయజట్టులోనూ సెంటర్ ఫార్వర్డ్ ప్లేయర్‌గా రాణించారు. 1992లో కలికిరికి చెందిన చిక్కా అశోక్‌ను వివాహం చేసుకున్నారు.కుమారులైన శివరాజ్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తుండగా, సాయితేజ ఎంబీబీఎస్ చేశాడు.



పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

ఉద్యోగ ప్రస్థానమిలా....

డీఎస్సీ 1996లో ఎంపికై స్కూల్ అసిస్టెంట్(కెమిస్ట్రీ)గా గుర్రంకొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో చేరారు.2001లో జూనియర్ లెక్చరర్‌గా ఎంపికై కలికిరి జూనియర్ కళాశాలలో ఐదేళ్ళు పాటు పనిచేసి, తన సబ్జెక్టుల్లో విద్యార్థులు 90 శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేశారు. పీలేరు, నగరి, పుత్తూరు జూనియర్ కళాశాలల్లో 15 ఏళ్ళ పాటు లెక్చరర్‌గా పనిచేసి గుర్తింపు సాధించారు. పదోన్నతిపై 2021లో శ్రీకాకుళం జిల్లాకు వెళ్లిన ఆమె సీతంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేశారు.గత ఏడాది మార్చి 14న చిత్తూరులోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీపై వచ్చారు.



ప్రిన్సిపాల్ జీవనజ్యోతి

నాక్ బృందాన్ని మెప్పించారు

పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా మొదటి రోజు నుంచే కళాశాలకు నాక్ గుర్తింపు లభించేందుకు కృషి చేశారు. వెయ్యి నుంచి 1200 మంది విద్యార్థులు కలిగిన ఈ కళాశాలలో 15 కోర్సులు నిర్వహించడంతో పాటు క్రీడలు, ఎన్‌సీసీలో జాతీయస్థాయికి విద్యార్థులను పంపడం, ఎన్ఎస్ఎస్‌లో పలు సేవా కార్యక్రమాలు చేయించడం, ల్యాబ్‌లో ప్రయోగాలు చేయించడం, సాంస్కృతిక, ఇతర రంగాల్లోనూ విద్యార్థులను రాణించేలా శిక్షణ ఇవ్వడంతో పాటు అధ్యాపక బృందానికి పలు సూచనలు చేస్తూ ప్రతి సబ్జెక్టులోనూ అత్యుత్తమ శిక్షణ, పరీక్షల నిర్వహణ వంటి విషయాల్లో ప్రత్యేక శ్రద్ధ చూపారు.కళాశాలలో అనేక అవగాహన సదస్సులు నిర్వహించడంతో పాటు విద్యార్థుల్లో భయాందోళన తొలగించడానికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు చేయించడం వంటి అనేక అంశాలు నాక్ బృందాన్ని ఆకర్షింపజేశాయి. ఈ క్రమంలో గత నెల 13,14 తేదీలతో నాక్ త్రిసభ్య కమిటీ బృందం కళాశాలను సందర్శించి అటానమస్ నాక్ ఎ గ్రేడ్ గుర్తింపు ఇచ్చారు. జీవనజ్యోతి ప్రిన్సిపాల్‌గా పనిచేసిన కాలంలో ఎనలేని గుర్తింపు రావడంపై కళాశాల అల్యూమ్నీతో పాటు నగర వాసుల నుంచి ప్రశంసలు వచ్చాయి.

రేపటి నుంచి తుడా టవర్స్ వేలం

తిరుపతి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతి అన్నమయ్య సర్కిల్ వద్ద నిర్మిస్తున్న 'తుడా టవర్స్'కు శనివారం నుంచి వేలం నిర్వహించనున్నట్లు వీసీ ఎన్.మౌర్య తెలిపారు. గురువారం నిర్మాణంలో ఉన్న తుడా టవర్స్‌ను ఆమె ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. వేలం నిర్వహణపై తుడా కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు 13 అంతస్థులలో తుడా టవర్స్ నిర్మాణం జరుగుతోందన్నారు. గ్రౌండ్, ఒకటో అంతస్థులో 27 దుకాణాలతో వాణిజ్య సముదాయాలు, రెండు, మూడు, నాలుగు అంతస్థులలో కార్యాలయాలకు, మిగిలిన అంతస్థుల్లో నివాసయోగ్యంగా 2, 3, 4 బెడ్ రూమ్ ఫ్లాట్లు నిర్మిస్తున్నామని వివరించారు. శనివారం నుంచి 12వ తేదీ వరకు వివిధ అంతస్థులకు వేలం నిర్వహిస్తామన్నారు. తుడా టవర్స్‌లో మోడల్ ఫ్లాట్, గ్యాలరీ ఏర్పాటు చేశామని, ఆసక్తిగలవారు చూడొచ్చన్నారు. ఈ సమావేశంలో కార్యదర్శి వెంకటనారాయణ, సూపరింటెండెంట్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, ఈఈ రవీంద్ర, తదితరులు ఉన్నారు.

● 'కల్తీ నెయ్యి' కేసు నిందితులకు

ముగిసిన సిట్ కస్టడీ

తిరుపతి(నేరవిభాగం), మార్చి 6(ఆంధ్రజ్యోతి): కల్తీ నెయ్యి కేసులో ఇద్దరు నిందితులకు మూడు రోజుల సిట్ కస్టడీ ముగిసింది. న్యాయస్థానం ఆదేశాల మేరకు ఈ కేసులో ఏ3 నిందితుడు పొమిల్ జైన్, ఏ4 అపూర్వ వినయ్‌కాంత్ చావడాలను మంగళవారం సిట్ అధికారులు తమ కస్టడీకి తీసుకున్నారు.సీబీఐ డీఐజీ మురళీ రాంబా నేతృత్వంలో విచారించారు. వారిద్దరి వాంగ్మూలాలను రికార్డు చేశారు. మూడు రోజుల కస్టడీ గడువు ముగియడంతో గురువారం సాయంత్రం బందోబస్తు మధ్య ఆ ఇద్దరిని జ్యుడిషియల్ కస్టడీకి అప్పగించారు. మరోవైపు ఏ2 నుంచి ఏ5 వరకు బెయిల్ కోసం దాఖలైన పిటిషన్లపై ఈ నెల 10న విచారణ జరగనుంది.


గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితుడి అరెస్టు

● ఐదు కిలోల గంజాయి సీజ్

తిరుపతి(నేరవిభాగం), మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితుడిని తిరుపతి ఈస్ట్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. అతని నుంచి ఐదు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈస్ట్ సీఐ రామకృష్ణ వివరాల మేరకు.. తిరుపతి ఎస్టీవీ నగర్‌కు చెందిన కురబ అరవింద కొంతకాలంగా విశాఖ, అరకు, తుణుకు ప్రాంతాల నుంచి గంజాయి తెప్పించి విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో ఒడిశా రాష్ట్రం చిత్రకొండకు చెందిన గణేష్ నుంచి రూ.లక్ష విలువైన గంజాయి కొనుగోలు చేసి ఆర్టీసీ బస్సులో తిరుపతికి తీసుకొస్తుండగా ముందుగా అందిన సమాచారం మేరకు తిరుపతి ఈస్ట్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ మహేష్ బాబు బస్టాండులో కాపుకాచి పట్టుకున్నారు. అతని నుంచి ఐదు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అరవిందను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని సీఐ చెప్పారు. ఇదే కేసులో ప్రధాన నిందితుడు గణేష్‌ను అరెస్టు చేయాల్సి ఉందన్నారు.

రథోత్సవంలో రెచ్చిపోయిన 'కేడీ సిస్టర్స్'

● రద్దీలో చేతివాటం ప్రదర్శన
● ఏడుగురు మహిళల నుంచి ఏడు బంగారు గొలుసుల చోరీ
● ఇద్దరు తమిళనాడు మహిళల అరెస్టు



స్వాధీనం చేసుకున్న బంగారాన్ని చూపుతున్న పోలీసు అధికారులు

శ్రీకాళహస్తి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా జరిగిన రథోత్సవంలో తమిళనాడుకు చెందిన ఇద్దరు అక్కా చెల్లెళ్లు చేతివాటం చూపారు. ఏడుగురు మహిళల నుంచి బంగారు గొలుసులు అపహరించారు. వీరిని గురువారం అరెస్టు చేశారు. శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి తెలిపిన ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం మధురై ప్రాంతానికిచెందిన మీనా అలియాస్ లక్ష్మి(29), తిరుచ్చి ప్రాంతానికిచెందిన పొన్నుమని(34) అక్కా చెల్లెళ్లు. వీరిద్దరూ తమిళనాడులోని పలు రద్దీ ప్రాంతాల్లో తిరుగుతూ చోరీలకు పాల్పడేవారు. మీనాపై తమిళనాడులో ఆరు చోరీకేసులు నమోదయ్యాయి. ఇటీవల ఓ కేసులో రిమాండు నుంచి బయటకు వచ్చింది. తమిళనాడులోని సంతలో చోరీ చేస్తూ పొన్నుమని పోలీసులకు పట్టుబడి అరెస్టయింది. ఈమె కూడా 20రోజుల కిందట బెయిల్‌పై విడుదలైంది. వీరిద్దరూ కలిసి గత నెల 27వ తేదీన శ్రీకాళహస్తిలో జరిగిన రథోత్సవానికి వచ్చారు. జనాలు అత్యధికంగా ఉండే చోట్ల ఏడుగురు మహిళల నుంచి సుమారు105గ్రాముల బంగారు చైన్లను చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు శ్రీకాళహస్తి వన్‌టౌన్ సీఐ గోపి కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల ఆధారంగా విచారణ సాగించారు. వారం రోజుల వ్యవధిలోనే తమిళనాడుకు చెందిన ఇద్దరు అక్కా చెల్లెళ్లను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. బంగారు గొలుసులను రికవరీ చేశారు. ఆ ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ చెప్పారు. వన్‌టౌన్ సీఐ గోపి, సిబ్బందిని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అభినందించి రివార్డును ప్రకటించారు.ఈ కార్యక్రమంలో సీఐలు తిమ్మయ్య, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ చైర్మన్ పీఆర్వోనంటూ భక్తులను మోసగించిన వ్యక్తి అరెస్ట్

తిరుమల, మార్చి6(ఆంధ్రజ్యోతి): టీటీడీ చైర్మన్ ఫొటోను వాట్సాప్ డీపీగా పెట్టుకుని, తాను పీఆర్వోనని భక్తులు నమ్మించి మోసం చేస్తున్న వ్యక్తిని గురువారం తిరుమల టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు.చంద్రగిరికి చెందిన ఫరూక్ అలియాస్ ప్రసాద్ నెల్లూరు జిల్లా కోవూరులో నివాసం ఉంటున్నాడు. నాలుగు నెలల నుంచి 'తిరుమల సమాచారం' అనే వాట్సాప్ గ్రూపు క్రియేట్ చేసి దాదాపు 600 మంది భక్తులను అందులో చేర్చాడు. శ్రీవారి దర్శనం, సేవలు కావాలంటే సంప్రదించాలని పోస్టులు పెట్టేవాడు. తాను టీటీడీ చైర్మన్ పీఆర్వో అని నమ్మించి తిరుమల దర్శన టికెట్ల సమాచారాన్ని గ్రూపుల్లో షేర్ చేసేవాడు. భక్తులు ఎవరైనా వ్యక్తిగతంగా కాల్ చేసి మాట్లాడితే ఆన్‌లైన్ ద్వారా నగదు తీసుకుని ఆ తర్వాత ఆ భక్తులకు సమాధానమిచ్చేవాడు కాదు. ఇలా దాదాపు రూ.80 వేల వరకు భక్తుల నుంచి వసూలు చేశాడు. భక్తుల ఫిర్యాదుతో చైర్మన్ బీఆర్ నాయుడు విచారణకు ఆదేశించారు. ఈక్రమంలో ఫరూక్‌ను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండుకు పంపారు.



స్వామి అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహిస్తున్న వేదపండితులు

ముక్కంటి ఆలయంలో శాంతి అభిషేకం

శ్రీకాళహస్తి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం శాంతి అభిషేకం నిర్వహించారు. మహాశివరాత్రి ఉత్సవాలు ముగిసిన మరుసటి రోజు ఉత్సవర్లకు శాంతి అభిషేకం నిర్వహించడం సంప్రదాయం. ఆలయంలోని అలంకార మండపం వద్ద ఉత్సవర్లకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అభిషేకాలు చేశారు. ఉత్సవాల్లో తెలియక పొరపాట్లు జరిగుంటే ప్రాయశ్చిత్తం కలిగేలా ఉత్సవమూర్తులకు హోమం ద్వారా శాంతి పూజలు చేస్తారు. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, అధికారులు, టీడీపీ నాయకులు చెంచయ్య నాయుడు, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో మొరాయిస్తున్న సర్వర్



డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లకోసం వేచివున్న కక్షిదారులు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో తరచూ సర్వర్ మొరాయిస్తుండడంతో కక్షిదారులు ఇబ్బంది పడుతున్నారు. రెండ్రోజులుగా రిజిస్ట్రేషన్‌శాఖ మెయిన్ కార్యాలయం నుంచే సర్వర్ కనెక్షన్ రాకపోవడంతో జిల్లావ్యాప్తంగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సర్వర్లు పనిచేయడం లేదు.మంచి ముహూర్తాలుండడంతో గురువారం ఎక్కువమంది కక్షిదారులు రిజిస్ట్రేషన్లకోసం చిత్తూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చారు. కానీ సర్వర్ మొరాయించడంతో మధ్యాహ్నం 3 గంటల వరకు వేచి వుండాల్సి వచ్చింది. అనంతరం సర్వర్ మెల్లగా పనిచేయడం ప్రారంభించడంతో డాక్యుమెంట్ల రిజిస్ట్రేషను ప్రారంభమైంది.రెండ్రోజులుగా ఇదే పరిస్థితి అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నెలకొంది.

రెడ్డిగుంట సబ్‌డివిజన్ కార్యాలయం ప్రారంభం

చిత్తూరు రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ రెడ్డిగుంట సబ్‌డివిజన్ కార్యాలయాన్ని గురువారం ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్ ప్రారంభించారు. స్థానిక గాంధీరోడ్డులో ఉండిన ఈ కార్యాలయాన్ని వినియోగదారులు సౌకర్యార్థం రెడ్డిగుంట సబ్‌స్టేషన్ వద్ద ఉన్న ఈఈ కార్యాలయం భవనంలోకి మార్పు చేసి, ప్రారంభించినట్లు ఎస్‌ఈ తెలిపారు. అనంతరం కార్యాలయ ఆవరణంలో మొక్కలు నాటారు. ఈఈలు మునిచంద్ర, సురేష్, డీఈలు ఆనంద్, ప్రసాద్, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్

జగన్ వితండవాదం : టీడీపీ

చిత్తూరు సిటీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ రెడ్డి.. వితండవాదం చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ అన్నారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. జగన్ రెడ్డి అసెంబ్లీ సమావేశాలకు దుమ్మాకొట్టి తాడేపల్లె ప్యాలెస్‌లో కూర్చొని ప్రెస్‌మీట్ల ద్వారా కూటమి ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయడమే పనిగా పెట్టుకున్నారని చెప్పారు. ఆయన ప్రసంగమంతా అసత్యాలు, నిరాధారమైనవేనని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడం లేదని, సూపర్ సిక్స్ పథకాలు ఎగ్గొట్టిందని పదేపదే దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. తొమ్మిది నెలల్లో కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషి, హామీల అమలు తీరు గమనించాలని సూచించారు. ప్రతిపక్ష హోదాకు సంబంధించి.. జగన్‌రెడ్డికి అన్నీ తెలిసి కూడా వితండవాదం చేస్తున్నారన్నారు.



సురేంద్రకుమార్

విజయ డెయిరీలో అవకతవకలపై
విచారణ జరిపించాలి
అసెంబ్లీలో యార్లగడ్డ వెంకట్రావు డిమాండు

అమరావతి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో విజయ డెయిరీలో పెద్దఎత్తున జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు గురువారం శాసనసభలో డిమాండ్ చేశారు. గన్నవరంలో టీడీపీ కార్యాలయంపై దాడి చేసిన నిందితులు విజయ డెయిరీలో ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లుగా కొనసాగుతున్నారని, గత ప్రభుత్వంలో మంత్రిగా చక్రం తిప్పిన పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి సొంత మనుషులు, ఆయన అనుయాయులకే పాల బూత్‌లు కట్టబెట్టారని ఆరోపించారు. దీనిపై పూర్తి వివరాలు సేకరించిన తర్వాత అవసరమైతే విచారణకు ఆదేశిస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సభలోనే ప్రకటించారు.

సీనియారిటీ జాబితాలో పొరబాట్లు లేకుండా చూడండి: ఎస్టీయూ

చిత్తూరు సెంట్రల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యాశాఖ సిద్ధం చేస్తున్న టీచర్ల ప్రొవిజినల్ సీనియారిటీ జాబితాలో పొరబాట్లు లేకుండా చూడాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంటా మోహన్, దేవరాజులు రెడ్డి తదితరులు కోరారు. ఈ మేరకు డీఈవో వరలక్ష్మికి వినతి పత్రం సమర్పించినట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పొరబాట్లు అధికంగా ఉండటంతో టీచర్లు ఆందోళనకు గురవుతున్నారన్నారు. మెరిట్, ర్యాంకు ప్రాతిపదికను సీనియారిటీ జాబితా రూపొందించాలని విన్నవించారు.

డీవైఈవో పరీక్షలు వాయిదా వేయాలి : ఆపస్


చిత్తూరు సెంట్రల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ డీఈవో (డీవైఈవో) పోస్టులను భర్తీ చేసేందుకు ఈనెల 26, 27 తేదీల్లో నిర్వహించనున్న ఏపీపీఎస్సీ పరీక్షలను వాయిదా వేయాలని ఆపస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలాజీ, వెంకటసత్యనారాయణ కోరారు. ఈ మేరకు గురువారం ఏపీపీఎస్సీ చైర్‌పర్సన్ ఏఆర్ అనురాధను కలిసి విజ్ఞప్తి చేశారు. అభ్యర్థుల ఎంపికలో రోస్టర్ పద్ధతిలో మార్పులు చేయాలనే వాదనలతోపాటు టెన్త్, ఇంటర్ పరీక్షల దృష్ట్యా వాయిదా వేయాలని విన్నవించారు.

చిటికెలో టెన్త్ హాల్ టికెట్ !
వాట్సాప్ గవర్నెన్స్‌తో సాధ్యం చేసిన కూటమి ప్రభుత్వం

వెదురుకుప్పం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వాట్సాప్ గవర్నెన్స్‌లో భాగంగా ఇప్పటికే చాలారకాల సేవలను కూటమి ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. తాజాగా పదో తరగతి పరీక్షల హాల్ టికెట్లను కూడా పొందుపరిచింది. దీంతో టెన్త్ హాల్ టికెట్ల కోసం విద్యార్థులు ఎక్కడికీ వెళ్లకుండా తమ చేతిలో ఉన్న సెల్‌ఫోన్ ద్వారా చిటికెలో తీసుకునే వెసులుబాటు అందుబాటులోకి వచ్చింది.

హెచ్‌ఎం ధ్రువీకరణ అవసరం లేదు

వాట్సాప్ గవర్నెన్స్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్ టికెట్‌ను సంబంధిత పాఠశాల హెచ్‌ఎం నుంచి ధ్రువీకరించుకోవాల్సిన అవసరం కూడా లేదు. ఎందుకంటే హాల్ టికెట్‌పైనే క్యూఆర్ కోడ్ ముద్రించబడి ఉంటుంది. దీన్ని పరీక్ష కేంద్రంలో స్కాన్ చేస్తే సంబంధిత విద్యార్థి వివరాలన్నీ క్షణంలో తెలిసిపోతాయి. హాల్ టికెట్ తీసుకోవడానికి విద్యార్థులు 95523 00009 నెంబరును మన మిత్ర ఏపీ ప్రభుత్వ వాట్సాప్ సర్వీసుల పేరిట సేవ్ చేసుకోవాలి. తర్వాత వాట్సాప్‌లో మన మిత్ర అని టైప్ చేస్తే వాల్ కనపడుతుంది. అక్కడ హాయ్ అంటూ టైప్ చేస్తే.. ఏ సేవ కావాలో ఎంచుకోండని సూచిస్తోంది. అక్కడ విద్యను ఎంపిక చేసుకోవాలి. ఇంటర్మీడియట్, పదో తరగతి హాల్ టికెట్ల విభాగాలు కనిపిస్తాయి. ఎస్ఎస్‌సీ హాల్ టికెట్ అన్న దాన్ని ఎంపిక చేసుకుని విద్యార్థి ఐడీ లేదా బర్త్ డే వంటి వివరాలను నమోదు చేస్తే పీడీఎఫ్ రూపంలో హాల్ టికెట్ డౌన్‌లోడ్ అవుతుంది. ఈ హాల్ టికెట్ ప్రింట్ తీసుకుని పరీక్షకు హాజరు కావచ్చు.



మారుమూల కుప్పంలో కార్పొరేట్ వైద్య సేవలు
సీఎం చంద్రబాబు పిలుపుతో పీఈఎస్ కాలేజ్ అండ్ హాస్పిటల్ ప్రారంభించిన దొరస్వామి నాయుడు

కుప్పం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కుప్పం లాంటి మారుమూల ప్రాంతంలో కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు అందించిన పీఈఎస్ సంస్థల చైర్మన్ ఎం.ఆర్.దొరస్వామినాయుడు చాలా మృదు స్వభావి. ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపుతో లాభనష్టాలు ఏమాత్రం ఆలోచించకుండా కుప్పంలో 2001లో పీఈఎస్ ఆసుపత్రిని స్థాపించారాయన. మరుసటి ఏడాది 2002లోనే అనుబంధంగా పీఈఎస్ వైద్య కళాశాలను తీసుకొచ్చారు. అదే ఊపులో 2003లో పీఈఎస్ నర్సింగ్ కళాశాలను సైతం స్థాపించారు.అతి తక్కువ ఖర్చుతో కుప్పం లాంటి మారుమూల ప్రాంతంలో పేదలకు నాణ్యమైన కార్పొరేట్ వైద్య సేవలు అందించడం దొరస్వామినాయుడికే చెల్లింది. అంతే కాదు.. పీఈఎస్ వైద్య కళాశాల ద్వారా అత్యున్నతమైన వైద్యవిద్యను అందిస్తున్నారు.వైద్య సేవలు, వైద్య విద్యను అందించడమే కాకుండా ఆయా సంస్థల ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశం కల్పించారు. కుప్పం పీఈఎస్ కళాశాల, హాస్పిటల్, నర్సింగ్ కళాశాలల్లో 45 యూజీ, పీజీ కోర్సులు నడుస్తున్నాయి. ఈ సంస్థలో స్వీపర్ నుంచి ప్రొఫెసర్ల దాకా సుమారు 5 వేల మంది ఉపాధి పొందుతున్నారు.అందుకే పీఈఎస్ సంస్థల అధినేత ఎం.ఆర్.దొరస్వామినాయుడు మృతికి కుప్పం వేదనతో నివాళులర్పిస్తోంది. పీఈఎస్ చైర్మన్ దొరస్వామినాయుడు 2014-2019 మధ్య కాలంలో కుప్పం నియోజకవర్గ కమిటీ అధ్యక్షుడిగా కుప్పం అభివృద్ధికి కూడా కృషి చేశారు.ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం ఆయన మృతికి సంతాపం ప్రకటించారు. కుప్పానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు.



పీఈఎస్ వైద్య కళాశాల, ఆస్పత్రి







సమావేశానికి హాజరైన స్వయం సహాయక సంఘాల మహిళలు - ఈ- సైకిళ్లు పంపిణీ చేస్తున్న కడా పీడీ వికాస్ మర్మత్, పీఎస్‌ఎం తదితరులు

మహిళా సాధికారతతో సమగ్రాభివృద్ధి
● ఈ- సైకిళ్ల పంపిణీలో వక్తలు

కుప్పం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఏ ప్రాంతమైనా సమగ్రాభివృద్ధి చెందాలంటే మహిళా సాధికారత ముఖ్యమైన అంశమని కడా పీడీ వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్ సంస్థల సమన్వయంతో కుప్పంలోని మహిళా సంఘాలకు గురువారం ఎలక్ట్రిక్ సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్టాండు సర్కిల్‌లో జరిగిన సభలో వికాస్ మర్మత్ మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలో మహిళా స్వయం సహాయక బృందాలలోని 300మంది మహిళలకు ఈ-సైకిళ్లు పంపిణీ చేయడానికి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మొదటి విడతలో 50 సైకిళ్లను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఈ- సైకిళ్ల ద్వారా స్వచ్ఛ రవాణా, స్థిరమైన అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం నియోజకవర్గంలో ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పనకు పరిశ్రమలతో అనుసంధానం చేస్తున్నారన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలలో ఉపాధి నిమిత్తం బస్సులు, ఆటోలు వంటి వాహనాలలో వెళ్లడం అధిక వ్యయంతో కూడుకున్న పని అని, ఈ వ్యయాన్ని ఈ-సైకిళ్లు తగ్గిస్తాయని చెప్పారు. అలాగే చిరు వ్యాపారాలు చేసుకుంటున్న మహిళా సంఘాల సభ్యులు సరుకులు రవాణా చేసుకోవడానికి కూడా ఇవి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. పీఎస్.మునిరత్నం మాట్లాడుతూ ప్రతి ఇంట్లో ఒక మహిళా పారిశ్రామికవేత్తను తయారు చేసే లక్ష్యంలో భాగంగానే ఈ-సైకిళ్ల పంపిణీ జరుగుతోందన్నారు.సీఈఎస్ఎల్ డెలిగేట్ రీతూ మాట్లాడుతూ ప్రధానంగా వ్యాపారవేత్తలైన మహిళలకు ఈ-సైకిళ్లు రవాణా ఖర్చు తగ్గించడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. సైకిళ్లు తీసుకున్న మహిళలకు శుక్రవారంనుంచి వినియోగంపై సాంకేతిక శిక్షణ ఇస్తామని చెప్పారు.మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు, వెలుగు ఏపీఎం చంద్రశేఖర్, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పుత్రశోకం
● 'పుత్తూరు' ప్రమాదంలో గాయపడిన పెద్ద కొడుకూ మృతి
● శోకసంద్రంలో గట్టు గ్రామం



మునికుమార్(ఫైల్ ఫొటో)

పుత్తూరు అర్బన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పుత్తూరు- చెన్నై జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తమ్ముడు దుర్మరణం చెందగా.. తీవ్రంగా గాయపడిన అన్న కూడా గురువారం అసువులు బాశారు. ప్రమాదంలో ఇద్దరు కొడుకులనూ పోగొట్టుకున్న తల్లిదండ్రులకు పుత్రశోకం మిగిలింది. పుత్తూరు మండలం నేసనూరు పంచాయతీ గట్టు గ్రామానికి చెందిన రైతు మంజునాథ్ కుమారులు మునికుమార్(19), రవిశేఖర్(18) పుత్తూరులో డిగ్రీ చదువుతున్నారు. బుధవారం ద్విచక్ర వాహనంపై కళాశాలకు బయలుదేరగా.. పిల్లారిపట్టు సమీపంలో రాంగ్‌రూట్లో వస్తున్న ట్రాక్టరు ఢీకొన్న విషయం తెలిసిందే. రవిశేఖర్(18) ప్రమాద స్థలంలోనే మృతి చెందగా, తీవ్రగాయాలై మృత్యువుతో పోరాడిన మునికుమార్(19) గురువారం మధ్యాహ్నం అసువులు బాశారు. పిల్లలపై ఎంతో ప్రేమ పెంచుకుని, వారి ఉన్నతి కోసం కలలు కన్న తల్లిదండ్రులకు తీవ్ర శోకాన్ని మిగిల్చారు. ఇద్దరు కొడుకులను కోల్పోయి ఒంటరిగా మిగిలిపోయారు. తాము సర్వం కోల్పోయామని గుండెలవిసేలా రోదించారు. ఒక్క కొడుకు మృతి చెందిన బాధ నుంచి తేరుకునేటప్పకే మరో కొడుకూ మృతి చెందాడన్న వార్త వారిని కుంగదీసింది. ప్రాణాలతో తిరిగి వస్తాడన్న భరోసాతో ఉన్న తల్లిదండ్రులకు మునికుమార్ విగతజీవిగా రావడంతో కన్నీరుమున్నీరయ్యారు. తమ గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థుల మృతితో గట్టులో విషాదం నెలకొంది. కాగా, బంధువుల సహకారంతో మునికుమార్‌కు ప్రైవేటు ఆసుపత్రిలో మెరుగైన వైద్యం కోసం రూ.12 లక్షలు ఖర్చు చేసినా ఫలితం లేకపోయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ రహదారిపై ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని పలుమార్లు పోలీసు అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని, పాత వందన వైన్స్ ప్రాంతంలో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కాగా, మునికుమార్ మృతదేహంతో ధర్నా చేసేందుకు సిద్ధపడ్డారు. పోలీసు అధికారులు వాహన వేగం నియంత్రణకు చర్యలు చేపడతామని విన్నవించడంతో ప్రజలు ధర్నా విరమించారు. కాగా, ప్రభుత్వాస్పత్రి వద్ద మృతుల బంధువులు, గ్రామస్థులు ఆందోళనకు దిగారు. ఆ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.



అంబులెన్సు వద్ద రోదిస్తున్న బంధువులు

సీసీ నిఘాలో తిరుపతి!
తొలిదశలో ముఖ్య ప్రాంతాల్లో ఏర్పాటు ● మలి విడతలో నగరమంతటా

తిరుపతి(నేరవిభాగం), మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక క్షేత్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ చర్యలు చేపడుతోంది. దశలవారీగా తిరుపతి నగరాన్ని సీసీ కెమెరాల నిఘాలోకి తీసుకెళ్లేలా ప్రణాళిక సిద్ధం చేసింది. తొలుత ముఖ్యప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నారు. ఆర్టీసీ బస్టాండు చుట్టుపక్కల, పెద్దకాపులేఅవుట్ ప్రాంతాల్లో దాదాపు 10 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. రైల్వేస్టేషన్‌లో జీపులు, ఆటోల కట్టడికి, అసాంఘిక శక్తులపై నిఘాకు మరో 10 సీసీ కెమెరాలు అమర్చారు. కర్నాల వీధి నుంచి పూర్ణకుంభం సర్కిల్ వరకు ప్రతి 100 మీటర్లకు ఒక శక్తిమంతమైన కెమెరా, ఎప్పుడూ తిరుగుతూ ఉండేలా ఏర్పాటు చేశారు. మరోవైపు దేశ విదేశాల నుంచి తిరుమలకు కాలినడకన, వాహనాల్లో భక్తులు వెళుతుంటారు. టీటీడీ ఉద్యోగులు, స్థానికులు కొందరు ద్విచక్ర వాహనాలు, కార్లు, జీపులను అలిపిరి వద్ద పార్కింగ్ చేసి కొండకు వెళుతుంటారు. ఇటీవల అలిపిరి సమీపంలోని భూదేవి కాంప్లెక్సు, లింక్ బస్టాండును అడ్డాగా చేసుకుని విచ్చలవిడిగా చోరీలు, పిక్ ప్యాకెట్లు, భక్తులను వివిధ రకాలుగా మోసగించి డబ్బులు లాక్కోవడం వంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. వీటిని దృష్టిలో వుంచుకుని ఎస్పీ హర్షవర్ధనరాజు.. తాజాగా భూదేవి కాంప్లెక్సు వద్ద మరో 16 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. తిరుపతిలో ట్రాఫిక్ నియంత్రణ, గంజాయి అక్రమ రవాణా, రౌడీలు, ఆకతాయిల ఆటకట్టించడం, విద్యార్థినులకు రక్షణ, నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడపడం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం వంటి కార్యకలాపాలను అడ్డుకోవడానికి రెండో దశలో అంతటా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. అన్ని రోడ్లు, రద్దీ కూడళ్లు, ఫ్లైఓవర్‌పై శక్తిమంతమైన కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. స్మార్ట్ సిటీ నిధుల కింద వీటిని కొనుగోలు చేయనున్నారు. ఇలా ఆయా శాఖల సమన్వయంతో నగరమంతటా సీసీ కెమెరాలను అమర్చనున్నారు. దీంతో ఆధ్యాత్మిక క్షేత్రం పూర్తిగా సీసీ నిఘాలోకి రానుంది.



కమాండ్ కంట్రోల్ నుంచి సీసీ కెమెరాల పనితీరును పరిశీలిస్తున్న ఎస్పీ

మిస్సయిన భక్తుడి కోసం..!
● అవ్వాచారి కోన లోయలో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు



సిద్దారెడ్డి దుస్తులను వాసన చూస్తున్న డాగ్ - సిద్దారెడ్డి (ఫైల్.. సీసీ ఫుటేజీ ఫొటో)

తిరుమల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అలిపిరి కాలినడకమార్గంలోని అవ్వాచారి కోన లోయలోకి దూకిన వ్యక్తి కోసం భద్రతా సిబ్బంది గురువారం తనిఖీలను కొనసాగించారు. అక్కగార్ల ఆలయానికి సమీపంలో బుధవారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి లోయలోకి దూకినట్టు శ్రీహరిబాబు అనే భక్తుడు భద్రతా సిబ్బందికి సమాచారం ఇచ్చారు. పోలీసులు, విజిలెన్స్, ఫారెస్ట్, ఫైర్ అధికారులు, సిబ్బంది దాదాపు 300 మీటర్లు లోయలోకి దిగి గాలించినప్పటికీ ఎలాంటి ఆనవాళ్లు లేకపోవడంతో తిరిగి వచ్చేసిన విషయం తెలిసిందే. తిరుమల నుంచి బయలుదేరి తిరుపతి చేరుకోని వారి గురించి సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు ఓ వ్యక్తిని గుర్తించాడు. భక్తుడు చెప్పిన ఆనవాళ్లు కూడా సరిపోవడంతో ఈ వ్యక్తి ఎక్కడి నుంచి వచ్చాడు, తిరుమలలో ఏం చేశాడనే అంశాలను తెలుసుకునేందుకు రివర్స్ మోడ్‌లో సీసీ కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలించగా ఆ వ్యక్తి తిరుమలలో టీ మాస్టార్‌గా పనిచేస్తున్న వీరప్ప అనే వ్యక్తిని కలిసినట్టు గుర్తించారు. ఈమేరకు వీరప్పను ప్రశ్నించగా అతని పేరు సిద్దారెడ్డిగా తెలిసింది. సిద్దారెడ్డికి చెందిన ఓ కీ ప్యాడ్ ఫోన్, ఓ జత బట్టలను వీరప్ప పోలీసులకు అందజేశాడు. దీంతో పోలీసులు ఆ దుస్తుల ఆధారంగా డ్యాగ్ స్క్వాడ్‌తో గురువారం అవ్వాచారి కోనలోయలో గాలించారు. ఈక్రమంలో పోలీసు డాగ్ కేవలం 30 మీటర్లు మాత్రమే లోపలకు వెళ్లి తిరిగి వెనక్కి వచ్చేసింది. దీంతో రెండో రోజూ ఆ వ్యక్తి గురించి ఎలాంటి ఆధారాలు లభించలేదు.

మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ అరెస్టు
● గంజాయి, హత్య, దొంగతనం కేసుల్లో నిందితుడు
● 16 పోలీసుస్టేషన్లలో 31 కేసులు నమోదు

వెదురుకుప్పం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మోస్ట్ వాంటెడ్ క్రిమినల్‌ను కార్వేటినగరం పోలీసులు గురువారం పట్టుకున్నారు. 16 పోలీసుస్టేషన్లలో 31 కేసులు నమోదై ఉన్నట్లు గుర్తించారు. ఇతడిని కార్వేటినగరం ఎస్ఐ పి.రాజ్‌కుమార్, సిబ్బంది రాజశేఖర్, లోకనాథం, యువరాజ్ బృందం చాకచక్యంగా పట్టుకున్నారు. వీరిని ఎస్పీ మణికంఠ అభినందించారు. వివరాలిలా.. నగరి మండలం తెరణి బ్రిడ్జి గ్రామానికి చెందిన బి.సుబ్రహ్మణ్యం కుమారుడు అవినాక్షయ్య(26) ఉమ్మడి జిల్లాలో 16 పోలీసుస్టేషన్లలో 31 కేసులు నమోదై ఉన్నాయి. గంజాయి, హత్య, దొంగతనం కేసుల్లో నిందితుడు. ఈ నేపథ్యంలో ఎస్పీ ఆదేశాలతో నగరి డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ పర్యవేక్షణలో కార్వేటినగరం సీఐ హనుమంతప్ప ఆధ్వర్యంలో ఎస్ఐ రాజ్‌కుమార్ తన సిబ్బందితో కలిసి నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. ఊతుకోట వద్ద అదుపులోకి తీసుకున్నారు. ఇతడిపై పలు కేసుల్లో నాన్ బెయిలబుల్ వారెంట్లు కూడా ఉన్నాయి.



అవినాక్షయ్యను అరెస్టు చూపిస్తున్న ఎస్ఐ రాజ్‌కుమార్

క్రమశిక్షణతోనే బంగారు భవిష్యత్తు



కార్యక్రమంలో మాట్లాడుతున్న పీఎస్ మునిరత్నం

కుప్పం రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యతో బయటకు వెళ్తేనే బంగారు భవిష్యత్తు సాకారమవుతుందని ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం అన్నారు. కుప్పం మండలం పైపాళ్యం జడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవంలో గురువారం ఆయన పాల్గొని మాట్లాడారు. పాఠశాల అభివృద్ధికి తనవంతు సహకారమందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులు డాక్టర్ వెంకటేశ్, చెక్కునత్తం మణి, సర్పంచి ఉమామహేశ్వరి, ఎంపీటీసీ ఆర్ముగం, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ దామోదరం, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రైవర్లు విధుల్లో అప్రమత్తంగా ఉండాలి



పంపిణీ చేసిన కేఎంపీఎల్ పుస్తకాలతో డీఎం, డ్రైవర్లు

కుప్పం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): డ్రైవర్లు తమ విధులపై అప్రమత్తంగా ఉంటూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని కుప్పం ఆర్టీసీ డిపో మేనేజరు గోపీనాథ్ అన్నారు. కుప్పం ఆర్టీసీ డిపో డ్రైవర్లకు గురువారం ఆయన కేఎంపీఎల్ పుస్తకాలను పంపిణీ చేశారు. రుషి జ్యువలర్స్ సహకారంతో పుస్తకాలను ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ప్రయాణికుల సురక్షిత, సుఖవంతమైన ప్రయాణమే ఆర్టీసీ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది, యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితేనే ఉత్తమ ఫలితాలు



పదో తరగతి విద్యార్థులతో దాతలు, ఉపాధ్యాయులు

కల్లూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితేనే ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతాయని హెచ్ఎం శ్రీవాణి తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం కల్లూరుకు చెందిన ముస్లిం నవజవాన్ సొసైటీ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు విద్యా సామగ్రిని ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు ముగిసేవరకు విద్యార్థులు టీవీలు, మొబైళ్లకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు నౌషాద్, అర్షద్, అఫ్రిద్, ఫయూమ్, ఉపాధ్యాయులు వెంకటశిద్దులు, రాజేంద్ర, రఫీ, నవాబ్‌జాన్, రహమత్, సైదుల్లా, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆవులపల్లెలో శాస్త్రోక్తంగా ధ్వజారోహణం



ఆలయంలో ఉత్సవమూర్తులకు పూజలు

సోమల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఆవులపల్లెలో కొలువు దీరిన ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల నేపథ్యంలో గురువారం శాస్త్రోక్తంగా ధ్వజారోహణం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయంలోని మూల విరాట్‌ను వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలకరించి అభిషేక పూజలు చేపట్టారు. గుత్తా చంద్రశేఖర్‌నాయుడు, కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. రాత్రి సూర్యప్రభ వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారిని పల్లకిలో అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. యాదవ సంఘ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

బల్ల అడవికి నిప్పు



రామకుప్పం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం బల్ల పంచాయతీ ఏగుట్ట గంగమ్మగుడి సమీపంలోని అటవీ ప్రాంతానికి గురువారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. సామాజిక అడవిలో నీలగిరి తైలం చెట్ల నుంచి రాలిన ఆకులు కాలుతుండగా గమనించిన లక్ష్మీపురం గ్రామస్తులు అటవీ అధికారులకు సమాచారమిచ్చారు. రామకుప్పం అటవీ ఉపక్షేత్రాధికారి ధనుంజయుడు, బీట్ అధికారి హరినాథరెడ్డి, వీఎస్ఎస్ చైర్మన్ చంద్రశేఖర్, సభ్యులు శ్రీనివాసులు, పళని చేరుకుని మంటలను అదుపు చేశారు.

వినియోగదారుల హక్కుల పరిరక్షణకే ఫోరం



సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాది ఎల్.భాస్కర్

పలమనేరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల హక్కుల పరిరక్షణకు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిల్లో వినియోగదారుల ఫోరం పనిచేస్తుందని.. సద్వినియోగం చేసుకోవాలని న్యాయవాది ఎల్.భాస్కర్ సూచించారు. గురువారం పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్య విభాగం ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. వినియోగదారులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. చట్టప్రకారం వినియోగదారులు హక్కులకు భంగం కలిగినప్పుడు సత్వర న్యాయం పొందవచ్చన్నారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేసులు, న్యాయవాది అరీఫుల్లా, కళాశాల వాణిజ్య విభాగాధిపతి డాక్టర్ చిదంబరం, డాక్టర్ కె.నందీశ్వరయ్య, అధ్యాపకులు, న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

పీఆర్‌సీ బకాయిలు చెల్లించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న రత్నారెడ్డి

పలమనేరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మూడు దశాబ్దాల పాటు ప్రజలకు, ప్రభుత్వానికి సేవలందించి ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్లకు ప్రభుత్వం వెంటనే 11వ పీఆర్‌సీ బకాయిలు, డీఏలు, తాత్కాలిక భృతి చెల్లించాలని పెన్షనర్ల సంఘం అధ్యక్షులు రత్నారెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం పలమనేరు పెన్షనర్ల సంఘ భవనంలో జరిగిన సమావేశంలో ఆ సంఘ అధ్యక్షులు రత్నారెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపిందన్నారు. కూటమి ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో సంఘ నాయకులు ధర్మయ్య, రాజన్న, విజయ్‌కుమార్, సత్యనారాయణప్రసాద్, సుబ్బన్న, నరసింహులు, ప్రభాకర్, దొరస్వామి తదితరులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న భువనేశ్వరి

పలమనేరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఈనెల 8న జరుగనున్న మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఐద్వా జిల్లా కన్వీనర్ భువనేశ్వరి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ లింగ వివక్ష లేని సమాజం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఆడపిల్లలు, మహిళలపై జరుగుతున్న దాడులు అరికట్టేందుకు ముందుకు రావాలని సూచించారు. సమాజంలో పురుషులతో పాటు మహిళలకు సమానమైన హక్కులు, అవకాశాలు కల్పించాలని కోరారు. ఐద్వా పట్టణ కార్యదర్శి జయంతి, నాయకులు రత్నమ్మ, ధనమ్మ, ఖైరున్నీసా, హరి, సీపీఎం నాయకులు గిరిధరగుప్తా పాల్గొన్నారు.

మాంసాహారంలో రంగులు కలిపితే చర్యలు



తనిఖీలు చేస్తున్న మున్సిపల్ అధికారులు

పలమనేరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మాంసాహారం, ఫలహారాల తయారీలో ప్రజారోగ్యాన్ని దెబ్బతీసే రంగులు వాడితే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ ఎస్.వి.రమణారెడ్డి హెచ్చరించారు. గురువారం పలమనేరు మున్సిపల్ అధికారులు, సిబ్బంది పలు మాంస దుకాణాలు, హోటళ్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు దుకాణాల్లో ఆరోగ్యాన్ని దెబ్బతీసే రంగుల వినియోగాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. దుకాణదారులకు జరిమానా విధించారు.

విద్యుత్ దీపాలకు మరమ్మతులు

సోమల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సోమల పంచాయతీలోని 10 గ్రామాల్లో పలు చోట్ల వీధిదీపాలు వెలగకపోవడంతో కార్యదర్శి జయశంకర్ సిబ్బందితో కలిసి గురువారం మరమ్మతులు చేయించారు. అలాగే పలు విద్యుత్ స్తంభాలకు కొత్త లైట్లు అమర్చారు. అలాగే సోమల బస్టాండు వద్ద మరమ్మతులకు గురైన మినరల్ వాటర్ ప్లాంటులో మరమ్మతులు చేయించారు. ఈవోపీఆర్డీ లక్ష్మీదేవి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

9న రైతుబజార్ ప్రారంభం



పలమనేరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పలమనేరులోని వారపు సంత జరిగేప్రాంతంలో రూ.30 లక్షలతో నిర్మించిన రైతు బజార్‌ను ఈనెల 9న ఆదివారం ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ప్రారంభిస్తున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి సంజీవకుమార్ తెలిపారు. ఇకపై రైతులు, రైతు సంఘాలు పండించిన కూరగాయలను నేరుగా రైతుబజార్‌లో విక్రయించుకోవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎట్టకేలకు నంజంపేట రోడ్డుకు మరమ్మతులు



నంజంపేట మార్గంలో జరుగుతున్న రోడ్డు మరమ్మతు పనులు

సోమల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సోమల-నంజంపేట, పెద్దఉప్పరపల్లె మార్గంలో రోడ్డు మరమ్మతు పనులు ఎట్టకేలకు గురువారం పూర్తి చేశారు. గత ఐదేళ్లుగా ప్రయాణం గగనంగా మారింది. వర్షాకాలంలో గుంతల రోడ్డులో వాహనాల్లో ప్రయాణం చేయాలంటే భయపడేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సోమల-పెద్దఉప్పరపల్లె మార్గంలోని 14 కిలోమీటర్లు తాత్కాలిక మరమ్మతులకు రూ.12 లక్షల నిధులతో పనులు పూర్తి చేశారు. అలాగే నంజంపేట నుంచి కమ్మపల్లె, గట్టువారిపల్లె, గురికానివారిపల్లె మీదుగా నాయనపాకాల వరకు రూ.12 లక్షలతో పనులకు శ్రీకారం చుట్టారు. సోమల-పెద్దఉప్పరపల్లె వరకు రోడ్డు మరమ్మతులు పూర్తి కావడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పనులను డీఈ సురేష్‌బాబు పర్యవేక్షించారు.

శిథిల భవనంలోనే పశు వైద్యం..!

● పొంచివున్న ప్రమాదం ● భయం గుప్పిట్లో వైద్యాధికారులు, సిబ్బంది



కందూరులోని పశు వైద్యశాల భవనం



భవనం లోపల పైకప్పు దుస్థితి

సోమల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం కందూరు పశువైద్యశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. వందేళ్లు దాటిన భవనం కావడంతో ఎప్పుడు కూలుతుందో.. ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని పనిచేసే అధికారులు, సిబ్బంది భయం భయంగానే విధులు నిర్వహిస్తున్నారు. పశువైద్యశాల భవనం బస్టాండ్ వద్దనే ఉండటంతో అక్కడే కొందరు ప్రయాణికులు, పాడి రైతులు వేచి ఉంటున్నారు. కొన్నేళ్లుగా మండల సమావేశాల్లో ఆ భవనాన్ని కూల్చి వేయాలని ప్రతిపాదనలు చేసినా కార్యరూపం దాల్చలేదు. దీంతో పశువైద్య సిబ్బంది అక్కడే విధులు నిర్వహిస్తున్నారు. కందూరు, కామిరెడ్డివారిపల్లె, వల్లిగట్ల, తమ్మినాయనపల్లె, నెల్లిమంద పంచాయతీలకు చెందిన రైతులు ఇక్కడే పశువైద్యసేవలు పొందుతున్నారు. దీంతో పాటు 5 పంచాయతీలకు చెందిన ప్రజలు నిత్యం బస్టాండు ప్రాంతానికి వచ్చి పశువైద్యశాల వద్దనే వేచి ఉంటున్నారు. అధికారులు స్పందించి కూలడానికి సిద్ధంగా ఉన్న భవనాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. సోమల ఏడీహెచ్ శ్రీనివాసులు నాయుడును వివరణ కోరగా భవనాన్ని కూల్చడానికి ప్రతిపాదనలు పంపామని.. కందూరు పశువైద్యశాలలోని పశువైద్యాధికారి రెండేళ్ల క్రితం తిరుపతికి డెప్యుటేషన్‌పై వెళ్లడంతో వైద్యసేవలు అందించడంలోనూ కొంతవరకు ఇబ్బందిగా మారిందని తెలిపారు.

డెప్యుటేషన్ రద్దు చేయాలని జిల్లా అధికారులకు నివేదికలు పంపామన్నారు. పెద్దఉప్పరపల్లె పశువైద్యాధికారి చందనప్రియ కందూరు పశువైద్యశాలలో అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

లద్దిగంలో రీసర్వే పనుల పరిశీలన



రీసర్వే పనులను పరిశీలిస్తున్న ఆర్డీవో భవాని

చౌడేపల్లె, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లద్దిగంలో జరుగుతున్న రీసర్వే పనులను గురవాఆరం ఆర్డీవో భవాని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ మండలంలో లద్దిగం పంచాయతీ రీసర్వే పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైందన్నారు. 4.80 చదరపు కిలోమీటర్ల వరకు పంచాయతీ విస్తీర్ణం ఉందని, 1187 ఎకరాల భూములు, 729 ఖాతాలు, 165 నోషనల్ ఖాతాలు, 29.50 ఎకరాలు డీకేటీ భూమి, 372.02 ఎకరాల ప్రభుత్వ భూమి, 786.19 పట్టా భూములు ఉన్నాయని తెలిపారు. ఇప్పటి వరకు 124 ఎకరాలు రీసర్వే చేసినట్లు తెలిపారు. రైతులు వారి పట్టా పాసు పుస్తకం, 1బీ జిరాక్స్‌లతో వీఆర్‌వోలను సంప్రదించాలన్నారు. ప్రతిఒక్కరి భూమి సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ హనుమంతు, సర్వేయర్లు గుణశేఖర్, మధు తదితరులు పాల్గొన్నారు.

రాజీ మార్గంలో కేసుల పరిష్కారం మేలు



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఆదినారాయణ

పలమనేరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రాజీమార్గంలో సివిల్, క్రిమినల్ కేసుల పరిష్కారానికి కృషిచేయాలని పలమనేరు సీనియర్ సివిల్ జడ్జి ఆదినారాయణ పిలుపునిచ్చారు. ఈనెల 8న జరుగనున్న జాతీయ లోక్ అదాలత్‌పై గురువారం జడ్జి ఆదినారాయణ కోర్టు ఆవరణలో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. జాతీయ లోక్ అదాలత్‌లో అత్యధిక సివిల్, క్రిమినల్ కేసుల పరిష్కారానికి సహకరించాలని సూచించారు. సమావేశంలో పలమనేరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్ష్మీపతి, న్యాయవాదులు పాల్గొన్నారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత



లక్ష్మీనగర్‌లో అవగాహన కల్పిస్తున్న కళాకారులు

రామకుప్పం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అడవుల సంరక్షణ అందరి బాధ్యతగా తీసుకోవాలని.. కుప్పం అటవీ క్షేత్రాధికారి జయశంకర్ ఆధ్వర్యంలో రామకుప్పం మండలంలోని పలు అటవీ సమీప గ్రామాల్లో గురువారం అటవీ పరిరక్షణపై కళాజాతతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అడవుల్లో వృక్షాల నరికివేత, చెట్లను కాల్చడం వంటివి చేపట్టరాదని సూచించారు. వన్యప్రాణులను రక్షించుకోవాలన్నారు. ఇబ్బందులు ఎదురైతే వెంటనే సంబంధిత అటవీ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. వన్యప్రాణులను వేటాడటం చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటారని తెలిపారు. ననియాల అటవీ విభాగాధికారి హరికుమార్, రామకుప్పం ఉపక్షేత్రాధికారి ధనుంజయుడు, బీట్ అధికారి నిరంజన్, అసిస్టెంట్ బీట్ అధికారి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణులందరికీ రక్షిత మంచినీరు



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

రామకుప్పం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలకు రక్షిత మంచినీటిని అందించమే ప్రభుత్వ ధ్యేయమని శాంతిపురం ఎంపీడీవో కుమార్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని మెరసనపల్లె గ్రామంలో ఆయన సంబంధిత అధికారులతో కలిసి తాగునీటి నాణ్యతను పరిశీలించారు. అనంతరం రక్షిత తాగునీటి వినియోగంపై ఆయన గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో ప్రతి 15 రోజులకో సారి తాగునీటి ట్యాంకులను తప్పకుండా శుభ్రం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు సుగుణమ్మ, నారాయణస్వామి, చెంగప్ప, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాంపల్లె కాలనీలో అక్రమాలు గుర్తించాలి



రాంపల్లె కాలనీలో అక్రమ నిర్మాణాలను చూపుతున్న నాయకులు

పుంగనూరు రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమగానిపల్లె పంచాయతీ రాంపల్లె కాలనీలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలు అక్రమించిన ఇళ్ల స్థలాలను గుర్తించి పేదలకు ఇవ్వాలని టీడీపీ పార్లమెంటు బీసీ సెల్ కన్వీనర్ గంగులప్ప డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం పేదల ఇళ్ల కోసం భూములను కొనుగోలు చేసి ఇళ్ల పట్టాలు ఇస్తే వైసీపీ పాలనలో ఇళ్ల పట్టాలను పేదల నుంచి ఆక్రమించుకుని ఇతరులకు విక్రయాలు చేశారని మండిపడ్డారు. వైసీపీ నాయకులు ఒక్కొక్కరు 10 నుంచి 20 ఇళ్ల స్థలాలను ఆక్రమించి వారి ఆధీనంలో ఉంచుకున్నట్లు తాము గుర్తించామని, వాటిని తిరిగి అర్హత కలిగిన పేదలకు ఇవ్వాలని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటరమణ, ఆర్సీ రమణ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ పాఠశాలలో సరస్వతీదేవి విగ్రహ ప్రతిష్ఠ



పుంగనూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తయిండ్లు మున్సిపల్ పాఠశాల ఆవరణలో గురువారం ఉదయం నూతనంగా సరస్వతీ దేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఉదయాన్నే వేదపండితులతో హోమాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమంలో ఎంఈవోలు చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్డెన్నశెట్టి, హెచ్ఎం సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు సుబ్రహ్మణ్యంరాజు, జ్యోతిరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం కేసుల్లో నిందితులకు జరిమానా

బైరెడ్డిపల్లె, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యంతాగి వాహనాలు నడపడం, బహిరంగంగా మద్యం సేవించడం వంటి కేసుల్లో పట్టుబడిన నిందితులకు పలమనేరు జేఎఫ్‌సీఎం కోర్టు గురువారం రూ.48 వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ పరశురాముడు తెలిపారు. మద్యంతాగి వాహనాలు నడిపిన నలుగురు నిందితులకు రూ.40 వేలు, బహిరంగంగా మద్యం సేవించిన 8 మందికి కలిపి రూ.8 వేలు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి వితరణ



శాంతిపురం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండలం కెనమాకులపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు నలంద విద్యా సంస్థల యాజమాన్యం గురువారం విద్యా సామగ్రిని వితరణగా అందించింది. నలంద కళాశాల కరస్పాండెంట్ సుధాకర్‌రెడ్డి, కళాశాల అధ్యాపకులు సుబ్రహ్మణ్యం, హరిప్రసాద్, గణేష్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బైరెడ్డిపల్లెలో ఉచిత వైద్యశిబిరం

బైరెడ్డిపల్లె, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లెలోని రాయల్ మహల్ కల్యాణ మండపంలో ఈనెల 8న ఉదయం 10 గంటలకు కుప్పం ఎస్ఆర్ సూపర్ స్పెషాలిటీ క్లినిక్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పవన్‌కల్యాణ్‌ను విమర్శించడం తగదు

పుంగనూరు రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను విమర్శించే స్థాయి మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు లేదని జనసేన పుంగనూరు రూరల్ పార్టీ అధ్యక్షుడు విరూపాక్షి అన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ గతంలో ప్రజలు 67 మంది వైసీపీ ఎమ్మెల్యేలను గెలిపించి ప్రతిపక్ష హోదా ఇచ్చినా అసెంబ్లీకి వెళ్లలేదని, ఇప్పుడు ప్రతిపక్ష హోదా కావాలని అడగడం సిగ్గుచేటుగా ఉందన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు వచ్చిన ఓట్లు జగన్‌కు రాలేదన్నారు. సమావేశంలో జనసేన నాయకులు హరినాయక్, బాలాజీ నాయక్, శ్రీనివాసులు, రాయుడు, కృష్ణప్ప పాల్గొన్నారు.

సీతారాములకు అభిషేకాలు



మొక్కులు తీర్చుకుంటున్న టీడీపీ నాయకులు

పుంగనూరు రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరడిగుంట పంచాయతీ కీలకిరి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో వేద పండితులు సీతారాముల విగ్రహాలను గురువారం ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఉదయాన్నే గణపతి పూజలు, హోమాలు, కలశ పూజలు, అభిషేకాలు చేశారు. కూటమి నాయకులు మాధవరెడ్డి, చైతన్యరాయల్, గంగాధర్, రమణ, రాంబాబు, సుబ్రహ్మణ్యం, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

పుంగనూరు రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మండలంలోని గూడూరుపల్లెకి చెందిన కదిరప్ప కుమారుడు సుబ్రహ్మణ్యం(49) వ్యవసాయ కూలీగా పని చేస్తున్నాడు. మంగళవారం రాత్రి సొంత పనులపై ద్విచక్రవాహనంలో పుంగనూరుకు వెళుతుండగా వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. గాయపడిన అతడిని తిరుపతిలోని స్విమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

పాతపాళ్యం అడవిలో మంటలు

కల్లూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు సమీపంలోని పాతపాళ్యం అడవికి గురువారం సాయంత్రం అకతాయిలు నిప్పుపెట్టారు. దీంతో అడవిలో మంటలు చెలరేగాయి. అడవికి ఆనుకొని ఉన్న మామిడితోటల్లోకి మంటలు వ్యాపించకముందే మంటలను గ్రామస్తులు, అధికారులు అదుపు చేశారు. అడవులకు నిప్పు పెడితే జరిగే నష్టాలపై అవగాహన సదస్సులు పెడుతున్నాయని, అయినా ఆకతాయిల ఆగడాలు మితిమీరుతున్నాయని ఫారెస్ట్ బీట్ అధికారి శ్రీదేవి తెలిపారు.

వీరజవాన్ల కుటుంబీకులకు ఆర్థిక సాయం


ఓ కుటుంబానికి చెక్కు అందజేస్తున్న వీవీ రెడ్డి

చిత్తూరు అర్బన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటనలో ఉన్న సైనిక సంక్షేమశాఖ సంచాలకుడు వీవీ రెడ్డి గురువారం వీరజవాన్ల కుటుంబాలను కలిశారు. మురకంబట్టు, ఓటిచెరువు, బంగారుపాళ్యం మండలంలోని అమరులైన సైనికుల సతీమణులకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున చెక్కులను అందజేశారు. అనంతరం జిల్లా సంక్షేమకార్యాలయంలో మాజీ సైనికులతో సమావేశం నిర్వహించారు. సైనిక సంక్షేమ కార్యాలయం అద్దెభవనంలో ఉందని, ప్రభుత్వ స్థలం ఉన్నప్పటికీ నిధులు లేనందున భవన నిర్మాణం చేపట్టలేదని మాజీ సైనికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కేంద్ర ప్రభుత్వం 50 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 50శాతం నిధులను మంజూరు చేయాల్సి ఉందన్నారు. నిధుల మంజూరుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు పళని, నేతలు సురేంద్ర, బాబు, రాజన్, జిల్లా సైనిక సంక్షేమ అధికారి కేవీ రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి సమస్యలు రానీయొద్దు

పాలసముద్రం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీవో కృష్ణమహేష్ రెడ్డి ఆదేశించారు. గురువారం తన కార్యాలయం సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలతో సమీక్షించారు. తాగునీరు సరఫరా చేసే పైపులైన్లలో లీకేజీలు లేకుండా చూడాలన్నారు. 15 రోజులకు ఒకసారి తాగునీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయించాలన్నారు. మరమ్మతులకు గురైన చేతి పంపులను రిపేరు చేయించి, వాడుకలోకి తేవాలని చెప్పారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శంకర్, ఈవోపీఆర్డీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తూకాల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు

పాలసముద్రం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బియ్యం తూకాల్లో అవకతవకలకు పాల్పడకుండా రేషన్ కార్డు దారులకు ఎండీయూ వాహనాల ఆపరేటర్లు, చౌకదుకాణం డీలర్లు పంపిణీ చేయాలని తహసీల్దార్ అరుణకుమారి ఆదేశించారు. గురువారం ఆమె వెంగళరాజుకుప్పం వద్ద ఎండీయూ వాహనం వద్ద తూనికలను పరిశీలించారు. ఆర్ఐ దేవి తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి ఆలయానికి ద్విచక్ర వాహనం విరాళం



ఐరాల(కాణిపాకం), మార్చి 6 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి కడపకు చెందిన ఉదయ్‌రెడ్డి గురువారం టీవీఎస్ జూపిటర్ వాహనాన్ని విరాళంగా అందించారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రాధాన్యం

వెదురుకుప్పం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తామని కార్వేటినగరం ఎంపీడీవో చంద్రమౌళి తెలిపారు. గురువారం డీఎంపురంలో తాగునీటి కొళాయిలు, ట్యాంకులను తనిఖీ చేశారు. తర్వాత కేఎంపురం పంచాయతీలోని గొల్లకండ్రిగ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఆయనవెంట కార్యదర్శి ఎస్.గోపి, ఇంజనీరింగ్ అసిస్టెంటు హరీష్ ఉన్నారు.

రోడ్డుకు ఇరువైపులా సర్వే


సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

గుడిపాల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లె నుంచి దాయంవారిపల్లెకు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా భూమి ఆక్రమణకు గురవుతోందని రామభద్రాపురం సర్పంచ్ హరిణి, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి హేమాద్రి నాయుడు, మాజీ సర్పంచ్ పళనిలు తహసీల్దార్ జయంతికి ఫిర్యాదుచేశారు. దీంతో రెవెన్యూ సిబ్బందిని పంపించి సర్వే చేయించి, రాళ్లను నాటించారు. సర్వేయర్లు గోపీనాథ్, కోటి, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం


పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

శ్రీరంగరాజపురం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మంగుంట గ్రామంలో ఉన్న లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో గురువారం స్వామివారికి కల్యాణోత్సవ కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది. అంతకుముందు ధ్వజారోహణతో ఆలయ వార్షిక ఉత్సవాలు మొదలయ్యాయి. తాతిరెడ్డి రుక్మిణమ్మ కుటుంబీకులు ఉభయదారులుగా వ్యవహరించారు. పరిసర గ్రామాలకు భక్తులు పూజల్లో పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

బంగారుపాళ్యం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ఎస్బీఐ వద్ద ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు చీఫ్ మేనేజర్ పి.సురేంద్రబాబు తెలిపారు. రత్నం మెమోరియల్ హాస్పిటల్ వైద్యులు వస్తారన్నారు. మండల ప్రజలు, ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్' నగరి డివిజన్ కమిటీ



నగరి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నగరి డివిజన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం నగరిలో జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా మూర్తి, ప్రధాన కార్యదర్శిగా హరికృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వర్మలను ఎంపిక చేశారు. నాలుగు సెక్షన్లకు విడివిడిగా అధ్యక్ష, కార్యదర్శులను ఎంపిక చేసుకున్నారు. నింద్ర సెక్షన్‌కు శివ, చిరంజీవి, పన్నూరుకు జానకి, దాము, నగరి రూరల్‌కు జనార్దన్, ధర్మేషన్, నగరి పట్టణానికి ప్రవీణ్‌కుమార్, సునీల్‌లను అధ్యక్ష, కార్యదర్శులుగా ఎంపిక చేశారు.

నేడు లేగదూడల ప్రదర్శన

వెదురుకుప్పం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తెల్లగుండ్లపల్లె గ్రామంలో శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు లేగ దూడల ప్రదర్శన ఉంటుందని మండల పశువైద్యాధికారి డాక్టర్ రాజేష్ గురువారం తెలిపారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకంలో పశు సంవర్థకశాఖ తరఫున ఈ ప్రదర్శన జరుగుతుందని వెల్లడించారు.

ప్రతి పంచాయతీలోనూ ఐదు పనులు ప్రారంభించాలి

ఉపాధి సిబ్బందితో క్లస్టర్ సహాయ పథక సంచాలకుడు

పెనుమూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి పంచాయతీలోనూ విధిగా ఐదు పనులను శుక్రవారం నుంచే ప్రారంభించాలని ఉపాధి సిబ్బందికి క్లస్టర్ సహాయపథక సంచాలకుడు బండారు సుబ్రహ్మణ్యం సూచించారు. పెనుమూరు ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఉపాధి సిబ్బందితో జరిగిన వారాంతపు సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఫారంపాండులను ఈనెలాఖరులోపు కనీసం పది పూర్తి చేయాలని సూచించారు. ఎంపీడీవో నీలకంఠేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి పంచాయతీలో కనీసం 100 మందికి ఉపాధికల్పించేలా చూడాలన్నారు.అదనపు ప్రోగ్రాం అధికారి గుణశేఖర్, అనూష, పరదేశి, వినోద్, క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో ప్రసంగిస్తున్న సుబ్రహ్మణ్యం

రైల్వే గేటు మూత

సమాచారం లేకపోవడంతో రెండ్రోజులుగా ఇబ్బంది పడుతున్న జనం



చిత్తూరు రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు మెసానికల్ మైదానం సమీపంలోని రైల్వేగేటును రెండ్రోజులుగా మూతవేశారు. మరమ్మతుల కారణంగా ఈనెల 8వ తేదీవరకు ఈ గేటు మూసి ఉంటుందని ఓ బోర్డును ఆ గేటుకు రైల్వే అధికారులు అమర్చారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఈ విషయమై జనానికి సమాచారం లేదు. దీనివల్ల రెండ్రోజులపాటు ఈ మార్గంలో వచ్చిన వారంతా ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా.. కలెక్టరేట్, వేలూరు వైపు వెళ్లేవారు ట్రాఫిక్ తక్కువగా ఉంటుందని ఇటువైపు వస్తుంటారు.

బీసీ రుణాల మంజూరులో అధికారుల నిర్లక్ష్యం: కాంగ్రెస్

వెదురుకుప్పం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ల ద్వారా రుణాల మంజూరులో అధికారుల నిర్లక్ష్యం వల్ల కూటమి ప్రభుత్వ ఆశయం నీరుగారుతోందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కందుకూరి హమేష్ గురువారం తెలిపారు. యూనిట్ల కేటాయింపుల్లో తారుమారు జరగడం, కేటగిరీవారీగా ప్రాధాన్యం లేకుండా చేశారని ఆరోపించారు. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోకుంటే కాంగ్రెస్ తరఫున బీసీ వర్గీయులతో కలసి ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు.

రేపు లోక్ అదాలత్

నగరి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నగరి మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ జరగనుందని జడ్జి గోపాలకృష్ణ తెలిపారు. వీలైనన్ని కేసులు లోక్అదాలత్‌లో పరిష్కరించేలా ఆయా శాఖల అధికారులు ప్రయత్నించాలని సూచించారు.

గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా ఉండాలి: డీపీవో

తవణంపల్లె, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా ఉండాలని డీపీవో సుధాకర్‌రావు అన్నారు. గురువారం స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై అరగొండ ఎస్‌డబ్ల్యూపీసీలో పూతలపట్టు, చిత్తూరు, గంగాధర నెల్లూరు నియోజకవర్గాల పరిధిలోని ఎనిమిది మండలాల్లోని గ్రామ కార్యదర్శులు, ఈవోపీఆర్డీలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో డీపీవో మాట్లాడుతూ.. గ్రామాల్లో ముఖ్యంగా పేడదిబ్బలు లేకుండా తొలగించాలన్నారు. జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు మాట్లాడుతూ.. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో విధిగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసుకుని, ప్రతి వెయ్యి మందికి ఒక హరిత రాయబారులను నియమించాలన్నారు. డీపీఆర్‌సీ షణ్ముగం, ఎంపీడీవో రెడ్డిబాబు, ఈవోపీఆర్డీ రాజేంద్రరాజు, కార్యదర్శి మురగేష్, సర్పంచ్ మల్లుదొరై ప్రశాంతకుమార్ పాల్గొన్నారు.

15 ఏళ్ల భూ సమస్యకు కూటమి ప్రభుత్వంలో పరిష్కారం

సీఎం చంద్రబాబుకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపిన బాధితుడు


ఏలుమలైకి వన్‌బీ అందిస్తున్న తహసీల్దార్ కిరణ్

విజయపురం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): దాయాదుల మధ్య పోరుతో అతడి భూమి ఆంక్షల పరిధిలోకి వెళ్లిపోయింది. ఈ సమస్య పరిష్కారం కోసం దాదాపు 15 ఏళ్లుగా మాధవరానికి చెందిన ఏలుమలై పండారం అధికారుల చుట్టూ తిరిగి విసిగిపోయాడు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో అర్జీ పెట్టుకుంటే తహసీల్దార్ కిరణ్ స్పందించి పరిష్కారం చూపి, గురువారం ఏలుమలైకి వన్‌బీ అందించారు. దీంతో సీఎం చంద్రబాబుకు, అధికారులకు బాధితుడు కృతజ్ఞతలు తెలిపాడు. ఆర్ఐ మార్కండేయులు, వీఆర్వో మేఘనాథం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని సారా రహితంగా మారుద్దాం: ఏఈఎస్


సమావేశంలో ప్రసంగిస్తున్న సుబ్రహ్మణ్యం

చిత్తూరు సిటీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని సారా రహితంగా మారుద్దామని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. నవోదయం 2.0 లో భాగంగా గురువారం గుడిపాల మండలం నంగమందళం, తిమ్మేపల్లె గ్రామాల్లో సారా నిర్మూలనపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. సారా తయారీ, అమ్మకాలు, తాగడానికి దూరంగా ఉంటామని స్థానికులతో ప్రమాణం చేయించారు. సీఐ శ్రీహరి రెడ్డి, ఎస్ఐ మోహనకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

చిత్తూరు కల్చరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకుసాగాలని డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీ శ్రీదేవి పిలుపునిచ్చారు. మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం డీఆర్‌డీఏ కార్యాలయంలో వేడుకలు జరిగాయి. డ్వాక్రా మహిళలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాస్థాయి 'ఇన్‌స్పైర్'కి విద్యార్థుల ఎంపిక


బ్రాహ్మణి - పూజిత - సంజన

వెదురుకుప్పం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి 'ఇన్‌స్పైర్'కు దేవళంపేట సోక్రటీస్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్ విద్యార్థులు ఎస్.బ్రాహ్మణి, బి.సంజన, కె.పూజిత ఎంపికయ్యారు. ఈ మేరకు ఆ పాఠశాల కరస్పాండెంట్ గుణశేఖర్ గురువారం తెలిపారు.

చేపలు పట్టుకోవడానికి గిరిజనులకు అనుమతి


చెరువు వద్ద వివరాలు తెలుసుకుంటున్న డీఎఫ్‌వో భరణి

బంగారుపాళ్యం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తుంబ గ్రామ పంచాయతీ యానాది కాలనీకి చెందిన గిరిజనులు కొత్తచెరువులో చేపలు పట్టుకోవడానికి అటవీశాఖ అనుమతి ఇచ్చినట్లు సర్పంచ్ ఉషశ్రీ, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్ గురువారం తెలిపారు. వారు మాట్లాడుతూ.. గత నెల 21వ తేదీన గిరిజనులు ఉపాధి నిమిత్తం తుంబ పంచాయతీలోని కొత్తచెరువులో చేపలు పట్టుకోవడానికి అనుమతి కోరుతూ జిల్లా అటవీశాఖాధికారి భరణికి వినతి పత్రం అందించారు. దీంతో డీఎఫ్‌వో గురువారం తుంబ కొత్తచెరువును క్షేత్ర స్థాయిలో పరిశీలించి.. గిరిజనులతో మాట్లాడారు. వీరికి అటవీశాఖ నిబంధనలకు లోబడి చేపలు పట్టుకోవడానికి అనుమతి ఇస్తూ.. ప్రత్యేక గుర్తింపు కార్డులు ఇస్తామని కూడా చెప్పినట్లు వివరించారు.

పొంచి ఉన్న ప్రమాదం



నింద్ర, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఎలకాటూరు నుంచి తిప్పాపురం వెళ్లే రోడ్డులో వ్యవసాయ పొలాల వద్ద 11 కేవీ విద్యుత్ తీగలు తక్కువ ఎత్తులో వేలాడుతుండటంతో ప్రమాదం పొంచి ఉందని రైతులు వాపోతున్నారు. విద్యుత్ తీగలు 12 అడుగుల ఎత్తులోనే ఉండటంతో చెరకును ట్రాక్టర్ ద్వారా రవాణా చేయాలన్నా భయంగా ఉందంటున్నారు. వెంటనే తమ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

'మా భూమిలో కొబ్బరి చెట్లు, పైపులైన్లు తొలగించారు'


తొలగించిన పైపులను చూపుతున్న అమృతవల్లి

చిత్తూరు రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తమ భూమిలో నాటిన కొబ్బరి చెట్లు, పైపులైన్లు కొంత మంది ఎక్స్‌కవేటర్‌తో తొలగించారని అమృతవల్లి అనే మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై గురువారం మీడియాకు వివరాలు తెలిపారు. ఆమె మాటల్లోనే.. 'చిత్తూరు అర్బన్ మండలం గాండ్లపల్లె రెవెన్యూ గ్రామం నల్లప్పనాయుడు కండ్రిగలో సర్వే నెంబరు 130/బీ7లో వారసత్వంగా మాకు వచ్చిన 1.60 ఎకరాల భూమిలో కొబ్బరి చెట్లు నాటి, పైపులైన్లు వేసుకున్నాం. వీటిని బుధవారం రాత్రి సుమారు తొమ్మిది గంటల సమయంలో అదే గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్నారని సమాచారం అందడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాం. పోలీసులొచ్చి ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీనికి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలి' అని అమృతవల్లి కోరారు.



ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

పెనుమూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సీఆర్‌కండ్రిగ పంచాయతీ బండమీదవూరు ఏఏడబ్ల్యూకి చెందిన కృష్ణయ్య ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతను తన గ్రామానికి వెళ్లే దారిలోని మర్రిచెట్టు వద్ద ఉన్నాడు. ఆ సమయంలో వడ్డిగుడిసెలు గ్రామానికి చెందిన వళ్లెమ్మ మనవడు చందు పిలిచాడు. కృష్ణయ్య వెళ్లకపోవడంతో అతడిని కొడుతూ, కులంపేరుతో దూషించాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు హెచ్ కానిస్టేబుల్ మధు గురువారం తెలిపారు.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

బంగారుపాళ్యం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ముగ్గురు పేకాటరాయుళ్లను గురువారం అరెస్టు చేసినట్లు సీఐ కత్తిశ్రీనివాసులు తెలిపారు. గుంతూరు వీరప్పనాయిని చెరువు సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడులు చేశారు. బంగారుపాళ్యంకు చెందిన పట్టాభి, రంజిత్ కుమార్, బాలయ్యలను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.10,500 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం సమీపంలో పేకాడుతున్న నలుగురిని గురువారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.3,670 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు.

మామిడి చెట్ల నరికివేతపై ఫిర్యాదు


నరికేసిన మామిడి చెట్లు

తవణంపల్లె, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మడవనేరి గ్రామంలోని తన మామిడి తోటలోకి బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి 8 సంవత్సరాల వయస్సు గల 22 మామిడి చెట్లను, నిమ్మ చెట్లను నరికి వేశారని ఈచనేరికి చెందిన సుబ్రహ్మణ్యం ఆవేదన వ్యక్తం చేశాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు గురువారం తెలిపాడు.

పెనుమూరు పోలీస్‌స్టేషన్‌కు భవనం నిర్మించండి

హోంమంత్రికి టీడీపీ వినతి

పెనుమూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి):పెనుమూరు పోలీస్‌స్టేషన్‌కు భవనం నిర్మించాలని హోంమంత్రి అనితకు టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్పీ సుధాకరరెడ్డి విజ్ఞప్తి చేశారు. అలాగే మండలంలో ఎర్రచందనం స్మగ్లింగ్‌ను అరికట్టాలంటే తక్షణం ఎస్ఐ పోస్టును భర్తీ చేయాలన్నారు. చావడి స్థలం 48 సెంట్లు ఉందని, అందులో 16సెంట్లు వ్యవసాయశాఖకు ఇచ్చారన్నారు. చావడిస్థలాన్ని పూర్తిగా ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి ఆక్రమించుకోవాలని ఓ వైసీపీనేత ప్రయత్నిస్తున్నారు కాబట్టి ఇక్కడే పోలీస్‌స్టేషన్‌కు భవనం నిర్మించేలా చూడాలని కోరారు. గతంలోనూ చావడి భవనంలోనే పోలీస్‌స్టేషన్ ఉండేదన్నారు.

పాతపాళ్యం అడవిలో మంటలు

కల్లూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు సమీపంలోని పాతపాళ్యం అడవికి గురువారం సాయంత్రం ఆకతాయిలు నిప్పుపెట్టారు. దీంతో అడవిలో మంటలు చెలరేగాయి. అడవికి ఆనుకుని ఉన్న మామిడితోటల్లోకి మంటలు వ్యాపించకముందే గ్రామస్తులు, అధికారులు అదుపు చేశారు.

ఆక్రమించిన భూములకు నగదు సెటిల్ చేయండి

పరమేశ్వరి గుడి ట్రస్ట్ వారికి ఆర్డీవో హెచ్చరిక


వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో శ్రీనివాసులు

గంగాధరనెల్లూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అగరమంగళం గ్రామంలో రైతులకు సంబంధించి భూములను ఆక్రమించుకున్న అంకాల పరమేశ్వరి గుడి ట్రస్ట్ వారు సంబంధిత రైతులకు వారం రోజుల్లోగా ఇవ్వాల్సిన నగదు సెటిల్ చేయాలని ఆర్డీవో శ్రీనివాసులు హెచ్చరించారు. దీనిపై జరిగిన ఆర్డీవో విచారణ ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధిత రైతులు తెలిపిన వివరాల మేరకు.. అగరమంగళం గ్రామంలో కొన్నేళ్ల కిందట కొత్తగా అంకాల పరమేశ్వరి గుడి నిర్మాణం చేపట్టారు. ఆ గుడి సమీపంలోని సంబంధిత రైతులతో సంప్రదించి న్యాయం చేయకుండానే గుడి ట్రస్ట్ వారు దౌర్జన్యంగా ఆరుగురు కుటుంబాలకు చెందిన వ్యవసాయ భూములను ఆక్రమించేసి ఫెన్సింగ్ వేశారు. ఐదేళ్లపాటు తమ సమస్యను పరిష్కరించాలని బాధిత రైతులు ఎంతమందికి విన్నవించినా ఫలితం లేకపోయింది. ఈ క్రమంలో కలెక్టర్‌కు తమ గోడు చెప్పడంతో ఆయన ఆదేశాలతో ఆర్డీవో బుధవారం రైతులు, ట్రస్ట్ సభ్యులను పిలిచి విచారించారు. రైతులకు భూముల పరంగా ఇవ్వాల్సిన మొత్తాన్ని వారంలోగా ఇవ్వాలని లేకుంటే కలెక్టర్ ఆదేశాలతో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారి వివరాలను ఇవ్వాలని తహసీల్దారుకు చెప్పి వెళ్లారు. జిల్లా సర్వేయర్ మహబూబ్, తహసీల్దారు చంద్రశేఖర్, మండల సర్వేయర్ సునీత పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

నేడు అమ్మన్ కోవెల ప్రారంభం

చిత్తూరు కల్చరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గిరింపేట బజారు వీధిలో శుక్రవారం అమ్మన్ కోవెలను ప్రముఖ చలనచిత్ర నటుడు పృథ్వీరాజ్ ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జబర్దస్త్ కళాకారులు పాల్గొంటారని పేర్కొన్నారు.

రేపు సీఎంసీలో వైద్య శిబిరం

గుడిపాల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): 190 రామాపురం సీఎంసీలో చిత్తూరు క్యాంపస్ ఆధ్వర్యంలో శనివారం 9 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు పీఆర్వో ప్రిన్స్ తెలిపారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేస్తారన్నారు.

విద్యా సామగ్రి వితరణ



విజయపురం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): విజయపురం ఉన్నత పాఠశాలలో రిటైర్డు ఉపాధ్యాయులు రామచంద్రరాజు, చంద్రయ్యలు కలిసి 48 మంది టెన్త్ విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు, జామెంట్రీ బాక్సులను వితరణ చేశారు. గురువారం వీటిని హెచ్ఎం శ్యామల ద్వారా విద్యార్థులకు పంపిణీ చేశారు. టీచర్లు పాల్గొన్నారు.

వ్యసనాలకు బానిసలు కావొద్దు

విజయపురం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వ్యసనాలకు బానిసలు కావొద్దని విద్యార్థులకు ఎస్ఐ బలరాం సూచించారు. గురువారం మాధవరం ప్రభుత్వ ఐటీఐలో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. కొందరు విద్యార్థులకు మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. ప్రిన్సిపాల్ గణేష్, సిబ్బంది పాల్గొన్నారు.

టీబీపై అవగాహన అవసరం

గుడిపాల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): టీబీ వ్యాధిపై అవగాహన అవసరమని గుడిపాల వైద్యాధికారి సంధ్య అన్నారు. గురువారం వసంతాపురం సచివాలయంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పరిధిలో టీబీ అలర్ట్ ఇండియా సహకారంతో ఆరోగ్యక్యాంపును నిర్వహించారు. 87మంది టీబీ, ఆస్తమా, బీపీ, డయాబెటిక్, ఇతర రక్త పరీక్షలు, స్కానింగ్ నిర్వహించారు. టీబీ అలర్ట్ ఇండియా ఫీల్డ్ ఆఫీసర్ సోమశేఖర్, సర్పంచ్ రజినీకాంత్, ఎంపీటీసీ విజయలక్ష్మి, జయదేవ నాయుడు సూపర్‌వైజర్ విజయ, వైద్యసిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

దుకాణాల వేలంతో రూ.2లక్షల ఆదాయం

చిత్తూరు కల్చరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కోదండరామాలయానికి చెందిన దుకాణాలకు గురువారం వేలం పాటలు నిర్వహించారు. ఈవో సుబ్రమణ్యం నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేలం పాటల్లో ఆలయానికి రూ.రెండు లక్షల ఆదాయం వచ్చింది. ఆలయాల ఇన్‌స్పెక్టర్ సుమనప్రియ, అర్చకులు వేణుగోపాల్, చెంగల్‌రాయలు, రెడ్డెప్ప, తదితరులు పాల్గొన్నారు.

12లోపు కొటేషన్ల ఆహ్వానం: శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాలకు పూలు, పండ్లు, ప్రసాదాలు, బ్యాండు, అర్చకుల సరఫరా, చలువ పందిళ్లు, పల్లకీల మోతగాళ్ల ఏర్పాటు తదితరవాటికి ఆసక్తిగల కాంట్రాక్టర్ల నుంచి కొటేషన్లు ఆహ్వానిస్తున్నట్లు ఈవో తెలిపారు. ఈనెల 12వ తేదీలోపు తమ కొటేషన్లు ఆలయ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

'సంత' వేలంతో రూ.16.75 లక్షల ఆదాయం

బంగారుపాళ్యం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం మేజర్ పంచాయతీలో 2025-26 సంవత్సరానికి దినసరి, వారపు సంత నిర్వహించుకోవడానికి బహిరంగ వేలం గురువారం జరిగింది. బంగారుపాళ్యంకు చెందిన లిక్టర్ సాహెబ్ అధికంగా వేలం పాడి దక్కించుకున్నారు. దీంతో పంచాయతీకి రూ.16,75,810 వచ్చినట్లు ఈవోపీఆర్డీ గణపతి తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉమాదేవి, పంచాయతీ కార్యదర్శి యుగంధర్, సిబ్బంది పాల్గొన్నారు.